# శాంతి

# SANTI

విశ్వమానవ సాభ్రాతృత్వ సందేశము గల ఆధ్యాత్మిక మాసపత్రిక

August / సెప్టెంబరు – **2025**

**ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే**
**అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్ తన్మయోభవేత్**



**పరమపూజ్య శ్రీ స్వామి ఓంకార్ మహారాజ్**

జననం : 1895 మరణం : 1982

## లోకశాంతి ప్రార్థన

(వ్యక్తి శాంతికి - విశ్వశాంతికి)

పూజనీయమైన ఓ దివ్య స్వరూపా!
మా లోపలను వెలుపలను మీదను క్రిందను అంతటను
నిండియున్న ఓ సర్వాంతర్యామి! మా లోపల ప్రత్యణువు
నందును ఇమిడి యుండి మా నేత్రములకు నేత్రము,
కర్ణములకు కర్ణము, హృదయములకు హృదయము,
మనస్సులకు మనస్సు, శ్వాసలకు శ్వాస, ప్రాణములకు ప్రాణము,
ఆత్మలకు ఆత్మవై వెలుగొందు ఓ దేవా! ప్రేమైక మూర్తీ !
నిన్ను తెలుసుకొను భాగ్యము ఇప్పుడు ఇచ్చటనే మాకు ప్రసాదింపుము.
ఓ తేజోమయమూర్తీ! తూర్పు పడమరల
ఉత్తర దక్షిణముల, ఈ విశ్వము నందంతటను అందరును
నీ దివ్య తేజస్సును గ్రహింతురు గాక!
ఓ సచ్చిదానంద స్వరూపా !
ప్రతి మానవ హృదయమునందును, నానాజాతి మధ్యమునను
శాంతి సామరస్యములను ప్రతిష్ఠింపజేయుము.
ఓ దేవా! ఇదియే మా మనః పూర్వకమైన ప్రార్థన.

**లోకాస్సమస్తా స్సుఖినో భవంతు !**

**ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః**

ఏకం సత్ విప్రా బహుధా వదంతి

ఒకే సత్యము అనేక విధములుగా బ్రహ్మజ్ఞులచే చెప్పబడినది.

– ఋగ్వేద సంహిత

# శాంతి

# SANTI

విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక

**స్థాపకులు : పరమపూజ్య శ్రీస్వామి ఓంకార్‌జీ మహరాజ్**

**సంపాదకులు : స్వామిని వినమ్రానంద**

VoL./ సంపుటి : 101 December / డిశంబరు -2025 No./ సంచిక : 12



| వ.నెం. | విషయసూచిక | పేజి నెం. |
|---|---|---|
| 1. | ప్రార్థన – మాండ్యూకోపనిషత్ | 2 |
| 2. | ధ్యానము – క్రీస్తు జన్మదిన సమయమున | 3 |
| 3. | శ్రీ ఓంకార్ ఆత్మకథ – అనువాదం : బొప్పన అరుణాదేవి | 4 |
| 4. | ఆనంద రామాయణం – పరిష్కర్త స్వామి సత్యాత్మానంద | 7 |
| 5. | ఏకజీవ వాదము – స్వామి బోధాత్మానంద | 12 |
| 6. | సర్వవేదాంత సిద్ధాంతసారసంగ్రహం<br>భగవత్పాద శ్రీ ఆది శంకరాచార్య విరచితం<br>టీకా–స్వామి బోధాత్మానంద సరస్వతి | 17 |
| 7. | దక్షిణామూర్తి స్తోత్రము – మానసోల్లాసము | 21 |
| 8. | కథ | 24 |
| 9. | కార్యక్రమములు | 26 |
| 10. | విరాళములు | 27 |



**ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి / రచయితలే బాధ్యులుకాని, సంపాదకులు కారు.**

**జీవిత సభ్యత్వం రూ. 1000/- లు సాలుసరి రూ. 100/-**




# ప్రార్థన

## మాండూక్యోపనిషత్

**పూజ్యశ్రీ తత్త్వ విదానందస్వామి**

**శ్లో॥ ఓమిత్యేతదక్షరమిదగ్ం సర్వం తస్యోపవ్యాఖ్యానం భూతం భవద్భవిష్యదితి సర్వమోంకార ఏవ ।**

**యచ్చాన్యత్త్రికాలాతీతం తదప్యోంకార ఏవ ॥1॥**

**తా॥** ఈ సమస్తము ఓమ్ అనే ఈ అక్షరమే. దాని స్పష్టమైన, బ్రహ్మకు దగ్గరగా ఉండే, వివరణము (ఆరంభించబడుచున్నది). భూతము, వర్తమానము, భవిష్యత్తు అనేది సర్వము ఓంకారమే. ఇంతేగాక, మూడు కాలములకు అతీతమైనది ఏది గలదో, అది కూడా ఓంకారమే.

**ఓమిత్యేతదక్షరమిదం = ఓమిత్యేదత్... అని మంత్రము.**

నామములచే నిర్దేశించబడే ఈ పదార్థముల సమూహమేది గలదో, అది నామములకంటె వేరుగా లేదు గావున, మరియు నామము ఓంకారము కంటె వేరుగా లేదు గావున, ఈ సర్వము ఓంకారమే. జగత్కారణమగు బ్రహ్మ కూడా, పేరు (ఓమ్) మరియు పేరుచే నిర్దేశించబడేది అనే ఉపాయమును పట్టుకొనియే, పొందబడుచున్నది గనుక, బ్రహ్మ కూడా ఓంకారమే.

సగుణ నిర్గుణబ్రహ్మరూపముగా ఓంకారమే ఉన్నది. అట్టి ఈ ఓమ్ అనే అక్షరము యొక్క ఉపవ్యాఖ్యానము. ఉప = దగ్గర. ఓంకారము బ్రహ్మను తెలుసుకునే ఉపాయము అగుట వలన, బ్రహ్మకు దగ్గరగా నుండుటచే, దాని స్పష్టమైన వివరణము ఉపవ్యాఖ్యానము అగును. అట్టి వ్యాఖ్యానము ప్రస్తావించబడుతోంది. తెలియబడాలి అని క్రియను అధ్యాహారము చేసి వాక్యమును పూరించవలెను.

భూతవర్తమాన భవిష్యత్తులు అనే మూడు కాలములచే వ్యాపించబడిన సర్వము ఏదిగలదో, అది కూడా, పైన చెప్పిన యుక్తిని బట్టి, ఓంకారమే యగును. ఇంకా ఏదైతే మూడు కాలములకు అతీతమైనది. అనగా కాలమునకు అతీతమైనది మరియు దాని కార్యమును బట్టి ఊహించబడేది అగు అవ్యాకృతము (మాయాశక్తి), సుషుప్తి మొదలైనది యేది గలదో, అది కూడా ఓంకారమే యగును.

అభిధానము (పేరు), అభిధేయము (పేరుచే నిర్దేశించబడేది) ఒక్కటే అయినప్పటికీ, ఓమిత్యేతదక్షరమిదం సర్వమ్ అని మొదలిడి (1వ మంత్రమునందు) అభిధానమును ప్రధానముగాచేసి నిర్దేశము చేయబడినది. అభిదానప్రధానముగా నిర్దేశించినదానినే మరల అభిధేయ ప్రధానముగా చేసి నిర్దేశించుటకు ప్రయోజనము, అభిధాన–

అభిధేయములు ఒక్కటియే (సర్వము బ్రహ్మయే) నని తెలియుటయే. ఎందుకంటే, అట్లుగానిచో (రెండు వైపులా ఐక్యమును చెప్పనిచో), అభిధానము అనే ఉపాయముచే అభిధేయమును తెలియుట గనుక అభిధేయము అభిధానమగుట అప్రధానము అనే ఆశంక కలుగును. రెండింటి (ముఖ్య) ఐక్యమును తెలియుటకు ప్రయోజనము ఒకే ప్రయత్నముచే అభిధాన-అభిధేయములను రెండింటినీ విలీనము చేసి, ఆ రెండింటికంటె విలక్షణమైన బ్రహ్మను (సాధకుడు) పొందును అనియే. దీనిని సమర్థిస్తూ శ్రుతి.... పాదములే మాత్రలు, మాత్రలు నిశ్చయముగా పాదములే అని చెప్పబోతోంది.

## ధ్యానము

### క్రీస్తుజన్మదిన పవిత్ర సమయమున

అదిగో! ఒక గొప్ప జీవాధారము. అందుండియే ప్రకాశమై ప్రేమ, తేజస్సు, జీవితములను ప్రవాహములు ఝల్లున ప్రవహించుచున్నవి.

మనమందరమును మనస్సాక్షిగా యిప్పుడే ఆ అమృత ప్రవాహమున స్నాన మాడుదముగాక!

భగవంతునియొక్క ప్రేమవాహినియందే పవిత్రమైన శక్తిని మనమందరమును పొందుదుము గాక!

అతని దివ్యప్రేమయే మనలను చక్కని బిడ్డలనుగా చేయుచున్నది.

అతని ప్రకాశమానమరైన నూతన జీవమే మన జీవితమందలి రక్తనాళము నందును కదలుచున్నది.

ఆ మహామహుని నుండి బహిర్గతమై ప్రవహించెడి జ్ఞానతేజమే మనలను అజ్ఞానము, ద్వైతము అను తప్పుదారుల పడనీయక సదా కాపాడుచున్నది.

ఆ భగవంతుని అనుగ్రహముచేతను, అతని ప్రేమచేతను ఆతని పూర్ణ ప్రతి స్వరూపులమై మనమందరమును పూర్ణత్వము నొందిన వారలమే ఎప్పుడో కాదు ఇప్పుడే. అదియే అతని మహిమ

ఓం...ఓం...ఓం...

ఈ కష్టములు, దుఃఖములు, ఆశాభంగములు వీటి మరొక రూపమే ద్వైత స్థితి. సాధువైననూ, సన్యాసి అయినను ఎంతవఱకు ఈ ద్వంద్వములను అతిక్రమించడో అంతవఱకు దుఃఖములు, బాధలు తప్పవు. ఈ మాయ లేక ద్వైతస్థితి లక్షణమట్టిది.

-ఓంకార సూక్తులు



# శాంతి ప్రదాత శ్రీ ఓంకార్ స్వామిజీ ఆత్మకథ

మూలం : స్వామిఓంకార్ అనువాదం : బొప్పన అరుణాదేవి

(గత సంచిక తరువాయి) అధ్యాయం - 66

## శాంతి ప్రార్థన గొలుసు

మొదటిసారి నేను 'చైన్‌స్మోకింగ్' అనే పదం విన్నప్పుడు నాకు దాని అర్థం తెలియలేదు. దాని గురించి అడిగి తెలుసుకున్నాక దాని అర్థం నాకు బోధపడింది. ఒక సిగరెట్టు వెలిగించి, ఇక ఒకదాని తర్వాత నిరంతరాయంగా, విడవకుండా కాల్చటమని చెప్పారు.

అదే విధంగా విడవకుండా నిరంతరాయంగా భగవంతుని ప్రార్థించేవారు ఎంతమంది ఉంటారు? అలాంటి పవిత్రమయిన భగవన్నామ స్మరణలో పగలు రాత్రి తేడా లేకుండా నిరంతరము కాలము గడిపే ఆత్మస్వరూపులు ధన్యులు. భగవంతునికి ధరింపచేసే పుష్పమాలలో ప్రతి ప్రార్థన కూడా ఒక ముడి లాంటిదే. ప్రతి ముడి ఇంకొక ముడితో కలిసినప్పుడే పూలదండ తయారవుతుంది. భగవంతుడే సూత్రము, గొలుసు లేదా విశ్వదారము దానితోనే అన్ని రకాల పూసలను కలిపి ముడివేస్తాము. జీవులు, ఆత్మలు ఆ పూసలు.

ఋషికేశ్‌లోని స్వామి శివానందాశ్రమములోనూ, అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో ఉన్న సీతారామక్షేత్రంలోనూ నిరంతరము పగలు రాత్రి భేదము లేకుండా హరేరామ మంత్రజపము జరుగుతుంటుంది. ఇది చాలా సంవత్సరాలుగా జరుగుతోంది. శాంతి ఆశ్రమములో కూడా భగవన్నామ జపాన్ని ఉదయము ఆరు గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకు నిరంతరాయంగా జరిపిస్తున్నాము. భక్తుల ప్రపంచంలో నిజంగా అవన్నీ ఎంతో పవిత్రమయిన ఆశీర్వదించబడిన ప్రదేశాలు.

విశ్వశాంతి ప్రార్థన అంటే నాకు ఎంతో ప్రేమ. అందువలన నాకు కూడా శాంతి ప్రార్థన గొలుసులాగా చేయటం చూడాలని ఉంది. విశ్వశాంతి ప్రార్థన విశ్వమంతా ఒక బంగారు గొలుసులాగా నిరంతరాయంగా, నిరాటంకంగా జరిగి వ్యక్తులను విశ్వంతో అనుసంధానము చేయాలని నా ఆకాంక్ష. అంతర్యామిగా కొలువైన పరమాత్మతో ఐక్యతను కలిగించాలి. వ్యక్తిగత శాంతి మాత్రమే విశ్వశాంతికి బాటలు వేయగల్గుతుంది. అందువలన నేను మన ఆశ్రమ భక్తులకు ఒక విజ్ఞప్తి చేస్తున్నాను. మీలో ప్రతి ఒక్కరూ విశ్వశాంతి ప్రార్థనను వ్రాసుకుని ఈ నెలలో దానిని ముగ్గురికి పంపించండి. ఈ విధంగా ప్రతి నెలా ముగ్గురికి పంపించటం

వలన సంవత్సరము జరిగేసరికి ముప్పైఆరుమందికి మీరు విశ్వశాంతి ప్రార్థనని ప్రచారము చేయగల్గుతారు. దాని వలన విశ్వశాంతి కల్గుతుంది.

అదేవిధంగా మీరు పంపించిన వారిని కూడా అదేవిధంగా ముగ్గురికి విశ్వశాంతి ప్రార్థన పంపించమని అడగండి. దాని వలన చాలా కొద్ది సమయంలోనే నూట ఎనిమిది మందికి విశ్వశాంతి ప్రార్థన చేరుతుంది. భగవంతుని అనుగ్రహము వలన ఈ శాంతి ప్రార్థన ఒక హృదయం నుండి వేరొక హృదయానికి గ్రామము నుండి వేరొక గ్రామానికి, అలాగే ఒక పట్టణము నుండి వేరొక పట్టణానికి, చివరికి ప్రపంచమంతటా ప్రచారమయిపోతుంది. సర్వాంతర్యామిపై విశ్వాసం ఉన్నవారికి విశ్వశాంతి ప్రార్థన పట్ల నమ్మకమున్న వారికి అన్నీ సాధ్యపడతాయి. వారికి అసాధ్యం అనేది ఏమీ ఉండదు. విశ్వశాంతి ప్రార్థన వైభవము, గొప్పతనము ఏమిటంటే దీనిని చదివిన వారికి తప్పకుండా పరమాత్ముని దివ్యానుభూతి కలుగుతుంది. కేవలము దానిని మళ్ళీ మళ్ళీ చదివినంత మాత్రాన్నే ఇది సాధ్యపడుతుంది. ఎందుకంటే భగవంతుడు హృదయాలకి హృదయం వంటివాడు. శ్వాసకే శ్వాస వంటి వాడు, ఆత్మకే ఆత్మ వంటివాడు.

ఆశ్రమభక్తుల్లో అనేకమంది చాలా తేలికయిన, సరళమయిన ఈ శాంతి ప్రార్థన చేయటం వలన ఎంతో ఉపయోగాన్ని పొందారు. ఇది దేశాలకి, మతాలకి అతీత మయింది. అందుకే ఆశ్రమభక్తుల్లో అన్ని మతాలవారు, అన్ని దేశాల వారు ఉన్నారు. జర్మనీ నుండి ఒక స్నేహితుడు తాను విశ్వశాంతి ప్రార్థన చేయడం ద్వారా జీవితంలో ఎదురయిన ఎన్నో కష్టాల నుండి, ఆపదల నుండి, ఇబ్బందుల నుండి విముక్తి పొందానని వ్రాశాడు. భారతదేశంలోని భక్తుడు ఒకరు తాను శాంతి ప్రార్థనని నూట ఎనిమిదిసార్లు పారాయణం చేయటం వలన శాంతిలోని మకరందాన్ని అనుభవించానని, సమాధిస్థితిని అనుభవించానని వ్రాశాడు. సుశీలాదేవి విశ్వశాంతి ప్రార్థన ఒక బంగారు గొలుసు వంటిదని అది జీవుడిని, దైవంతో అనుసంధానం చేస్తుందని అంటూ ఉండేది.

భగవంతుని అనుగ్రహము వలన విశ్వశాంతి ప్రార్థన భారతదేశంలోని ప్రధాన మయిన భాషలన్నింటిలోనికి, అలాగే ప్రపంచంలోని కొన్ని భాషల్లోనికి అనువదించ బడింది. ఆశ్రమానికి వ్రాసిన వారందరికి ఉచితంగా పంపించేవారము. మనము సంతోషంగా ఆనందంగా ఉండాలని అంటే దానికి చాలా సరళమయిన, తేలికయిన మార్గము ఇతరులను సంతోషంగా, ఆనందంగా ఉండేలా చూసుకోవటమే. కేవలం నీ గురించి మాత్రమే నీవు ఆలోచిస్తే నీ జీవితము దుఃఖమయంగా మారిపోతుంది.



అందువలన నీవు సంతోషంగా ఉండాలంటే ఇతరుల గురించి ఆలోచించు. ఇతరులకు సహాయము చేయటం ద్వారా వారికి సేవ చేసి శాంతి ప్రార్థనని ప్రచారము చేద్దాము. మనలో ప్రతిఒక్కరము విశ్వం యొక్క గొలుసు. లేదా సూత్రములోని ఒక్కో ముడిగా మారితే భగవంతునికి మాలగా మారిపోతాము. ఇతరులకు సేవ చేయటము అంటే నీకు నీవు సేవ చేసుకోవడమే. ఈ విధంగా విశ్వశాంతి ప్రార్థనని ప్రచారము చేయుట ద్వారా విశ్వశాంతి ప్రార్థన బంగారు గొలుసులో ముడులుగా మారి ఈ భూమిపైన శాంతి సౌఖ్యాలను, దేశాల మధ్య సమైక్యతను సాధించుదాము.

**తోటపల్లి కొండలకి రాక్‌ఫెల్లర్‌ని**

ఒక పర్యాయము నిర్వాణమందిరము డాబాపైన కూర్చుని చుట్టూ కనబడుతున్న నీలి కొండలను ఆశ్రమాన్ని పరివేష్ఠించి ఉన్న ఆ కొండలను చూస్తూ, అందమయిన పక్షుల కిలాకిలా రావాలు వింటూ, సూర్యుని కిరణాలలో తడవసాగాను. ఈ అందమయిన ప్రకృతి అంతా కనిపించే దైవమే. అందుకే చల్లగా వీచే పిల్లగాలుల్లో నేను ఆయన ఉనికిని అనుభూతిని చెందుతుంటాను. అలాగే నాకు నేను 'రాక్‌ఫెల్లర్' లాగా అనిపిస్తుంటాను. ఎందుకంటే నేను సంతోషంగా, సంతృప్తిగా ఉన్నాను.

ప్రియమయిన పాఠకులారా! నేనే కాదు, మీరు కూడా ఏదో ఒకరోజు 'రాక్‌ఫెల్లర్' కావచ్చు. ఎప్పుడయితే మీ అభిప్రాయాలను అసత్యము నుండి సత్యం వైపుగా మార్చుకున్నప్పుడు, అనిత్యము నుండి నిత్యత్వము వైపుగా అలాగే వికాశము వైపు నుండి అమరత్వం వైపుగా మార్చుకుంటారో అప్పుడు. ఇంతకంటే ఇంకేమి కావాలి. నాకు ఏదయితే చెందుతుందో అదంతా మీకు కూడా చెందుతుంది. ఈ శాంతి ఆశ్రమము, శాంతి మిషన్ నాకే కాదు మీకు, అలాగే సత్యాన్వేషకులందరికి వార సత్వంగా చెందుతుంది. ఇప్పుడు ప్రపంచంలోని ధనవంతులందరి కంటే ఎక్కువగా మనమే గొప్ప ధనవంతులము అనిపిస్తోంది. కోరికలన్నింటికి అతీతులము కనుక. నా హృదయము ఎంతో సంతోషంతో మళ్ళీ మళ్ళీ చెపుతోంది. మిలియన్ల డాలర్ల డబ్బు అవసరం లేకుండానే ఈ ప్రపంచంలో ఎవరయినా కుబేరులు కావచ్చునని.

ఆధ్యాత్మిక, జ్ఞాన సంపద, దివ్యత్వము ప్రతి స్త్రీ, పురుషుల జన్మహక్కు. అది వారి అంతరంగంలోనే నిబిడీకృతమై ఉంది. తనను గుర్తించమని అది ఎదురు చూస్తుంది. అందువలన ఇప్పుడు నీ వంతుగా నీవు దానిని గుర్తించు, ఆ దివ్యత్వాన్ని అనుభవించు. నీ ప్రతి ఆలోచనలో, మాటల్లో, చేతల్లో ఆ దివ్యత్వాన్ని ప్రదర్శించు. అప్పుడు నీవు కూడా 'రాక్‌ఫెల్లర్'వి కాగల్గుతావు. ప్రపంచ మానవాళి సముద్ధరణ కోసం సహాయపడగల్గుతావు.

**ఓం ఓం ఓం**

# ఆనంద రామాయణము

(గత సంచిక తరువాయి) **పరిష్కర్త : స్వామి సత్యాత్మానంద**

## 4వ సర్గ (బృందాశాప వృత్తాంతము)

## కైకేయి యొక్క జన్మాంతర కలహాఖ్యానము.

"మునుపు సహ్యాద్రి దేశమున కరవీరపురమునందు ధర్మాత్ముడు, జ్ఞానియైన 'ధర్మదత్తు' డను ఒక బ్రాహ్మణుడు ఉండెను. అతడు నిష్ఠగా శ్రీమన్నారాయణ పూజా పరాయణుడై విష్ణువ్రతమును ఆచరించుచుండెను. ఆ ధర్మదత్తుడు వాసుదేవ ద్వాదశాక్షర మంత్ర జప పరాయణుడు. అతిథి ప్రియుడు. ఆ విప్రుడు ఒకానొక కార్తీక మాసమున హరిజాగరణము కొరకు సాయంకాలవేళ శ్రీవిష్ణు దేవాలయమునకు పూజోపకరణములను తీసికొనిపోవుచుండెను. దారిలో వ్రేలాడు నాలుకయును, కోరలు గల దంతములును, శుష్కించిన అంగములును, రక్తము ఓడుతూ, భయంకర ధ్వని కలిగి దిగంబరయైన రాక్షసియొకతె కనబడెను. ధర్మదత్తుడు దానినిజూచి, భయమునొంది, వణకుచు పూజాసామాగ్రిని, అభిషేక జలమును క్రింద పారవేసెను.

**తదా భర్తా మయోక్తః స మిత్రం తే సాధుసత్తమమ్ ।**
**సమాహ్వాయామ్యశనార్థమద్యైవ బ్రాహ్మణోత్తమమ్ ॥** 138

**తతో మయా సమాహూతః స్వయం గత్వా పతేః సఖా ।**
**తదారభ్య నిషేధోక్త్యా కార్యమాజ్ఞాపయత్పతిః ॥** 139

**ఏకదా స పితుర్నృష్ట్వా క్షయాహ్వాః స్వపతిర్మమ ।**
**మామాహ దయితే శ్రాద్ధం న కరిష్యామ్యహం పితుః ॥** 140

**తద్వాక్యం స్వపతేః శ్రుత్వా మయా విప్రా నిమంత్రితాః ।**
**మయా ధిక్ ధిక్ కృతో భర్తా కథం శ్రాద్ధం కరోషి నః ॥** 141

**పుత్ర ధర్మం నా జానాసి కా గతిస్తే భవిష్యతి ।**
**తతః పునః స మామాహ పక్వాన్యమద్య మా కురు ॥** 142

**ద్విజం నిమంత్రయస్త్వేకం మా విస్తారం కురు ప్రియే ।**
**తత్తస్య వచనం శ్రుత్వా మయాఽష్టాదశ భూసురాః ॥** 143

**నిమంత్రితాస్తు శ్రాద్ధార్థం పక్వాన్నాని కృతాని హి ।**
**తతః పునః స మామాహ ప్రియ శ్రుణు వచో మమ ॥** 144

**మయా సహాదౌ త్వం మిష్టం పాకం భుక్త్వా తతః పరమ్ ।**
**స్వీయోచ్ఛిష్టం త్వద్య విప్రాన్ పరివేషణమాచర ॥** 145

**తన్మయా వచనం శ్రుత్వా స పతిర్ధిక్కృతః పునః ।**
**కథమాదౌ స్వయం భుక్త్వా పశ్చాద్విప్రాన్ సమర్పయేత్ ॥** 146



**ఏవం సర్వం నిషేధోక్త్యా శ్రాద్ధం సాంగం చకార సః ।**
**పిండదానాదికం కృత్వా మామాహ స పతిః పునః ॥** 147

**అహంచోపోషణం త్వద్య కరిష్యామి న సంశయః ।**
**తత్తస్య వచనం శ్రుత్వా మిష్టాన్నేన స భోజితః ॥** 148

**తతో దైవవశాద్భర్తా విస్మృత్యా ప్రాహ మాం పునః ।**
**నీత్వా పిండాన్ క్షిపస్వాద్య సత్తీర్థే పరమాదరాత్ ॥** 149

నాభర్త అట్లేయని ఇంటికి వచ్చి, ప్రియురాలా! "నేడు మహాదుష్టుడైన నా మిత్రుని భోజనమునకు పిలువవలదు," అని నాతో చెప్పెను. అందుకు నేను, "అతడు చాలామంచివాడు. గనుక ఎందుకు పిలువకూడదు? నేడే పిలచంరెదను" అని తీసుకొనివచ్చి, మంచి భోజనమును పెట్టితిని. అది మొదలు నా భర్త వ్యతిరేకపు మాటలోనే కాలము గడుపుచుండెను. ఇలా జరుగుచుండగా మా మామగారి తద్దినము రాగా, నా పతి నాతో, "నేడు నా తండ్రి శ్రాద్ధము చేయన"నెను. వెంటనే నేను విప్రులను నిమంత్రించి, ఛీ, ఛీ, ఎట్లు శ్రాద్ధము చేయవు? పుత్రధర్మము తెలియదా? చేయకపోయిన నీకేమి గతిపట్టును? అని తిరస్కరించితిని. అందుకు, "అయితే పక్వాన్నములను వండవలదు, ఒక బ్రాహ్మణునే చెప్పుము, విస్తారము చేయకుము," అనిన పతిమాటకు ప్రతికూలముగా 18మంది విప్రులను చెప్పితిని. పక్వాన్నములను వండితిని. అందుకు మరల నా భర్త నాతో, "ఓసీ! నామాట వినుము, మన మిరు వురము వండినదానిని మొదట తిని మిగిలినదానిని బ్రాహ్మణులకు పెట్టుదము," అనెను. అది విని భర్తను ధిక్కరించుచు, శ్రద్ధతో శ్రాద్ధ పాకమొనరించి, బ్రాహ్మణులకు పెట్టితిని. ఇట్లు సర్వనిషేధోక్తులతో శ్రాద్ధమును సాంగముగా నెరవేర్చి, పిండాదికము నాచరించి, కడపట నేనుపవాసము చేసెదననెను. నేను ఎంతమాత్రము సరిపడదని మృష్టాన్నమును పెట్టి, భోజనము చేయించితిని. అటుమీద దైవవశమున నా భర్త మరచి, ఎంతో ఆదరముతో "ఈపిండములను మహాతీర్థమున విడిచిరమ్ము," అనెను.

**తతో మయా శౌచకూపే నీత్వా పిండా విసర్జితాః।**
**తతః ఖిన్నమనా విప్రో హాహేత్యుక్త్వా స్థిరోఽభవత్ ॥** 150

**క్షణం విచింత్య మామాహ పిండాన్మా త్వం బహిః కురు ।**
**తదోత్తీర్య శౌచకూపే మయా పిండా బహిః కృతాః ॥** 151

**తతః పునః స మామాహ పిండాన్ తీర్థే క్షిపస్వ మా ।**
**తదా తీర్థే మయా క్షిప్తాః తేపిండాః పరమాదరాత్ ॥** 152

**ఏవం మయా కదా భర్తుర్వచనం న కృతం తదా ।**
**కలహప్రియాయా నిత్యం మయ్యుద్విగ్నమనా యదా ॥** 153

పరిణేతుం తతోఽన్యా వై మనశ్చక్రే పతిర్మమ ।
తతో గరం సమాదాయ ప్రాణస్త్యక్తో మయా ద్విజ ॥ 154

అథ బధ్వా వధ్యమానాం మాం నిస్యుర్యమకింకరాః ।
యమశ్చ మాం తదా దృష్ట్వా చిత్రగుప్తమపృచ్ఛత ॥ 155

యమ ఉవాచ

అనయా కిం కృతం కర్మ ఫలం శుభమథాశుభమ్ ।
ప్రాప్నోత్యేషా చ తత్కర్మ చిత్రగుప్తావలోకయ ॥ 156

కలహోవాచ

చిత్రగుప్తస్తదా వాక్యం భర్త్సయన్మామువాచ హ ।

చిత్రగుప్త ఉవాచ

అనయా తు శుభం కర్మ కృతం కించిన్న విద్యతే 157

మిష్టాన్నం భుజ్యమానేయం న భర్తరి తదర్పితమ్ ।
అతశ్చ వల్గునీయోన్యాం స్వవిష్ఠాదాఽత్ర తిష్ఠతు ॥ 158

పతిం ద్వేష్టి సదా త్వేషా నిత్యం కలహకారిణీ ।
విష్ఠాదా సూకరీయేన్యాం తస్మాత్తిష్ఠత్వియం యమ ॥ 159

పాకభాండే సదా భుంక్తే గుప్తం చైకా యతస్తతః ।
తస్మాద్దోషాద్బిడాలాఽస్తు స్వజాతాపత్యభక్షిణీ ॥ 160

భర్తారమపి చోద్దిశ్య హ్యాత్మఘాతః కృతోఽనయా ।
తస్మాత్ ప్రేతశరీరేఽపి తిష్ఠత్వేకాఽతినిందితా ॥ 161

అతశ్చైషా మరుదేశే ప్రాపితవ్యా హరేర్భటైః ।
తత్ర ప్రేతశరీరస్థా చిరం తిష్ఠత్వియం తతః ॥ 162

ఊర్ధ్వం యోనిత్రయం చైషా భునక్త్వశుభకారిణీ ।

కలహోవాచ

తతో దూతైః ప్రాపితాఽహం మరుదేశంక్షణాద్ద్విజ 163

దత్వా ప్రేతశరీరం మాం గతాస్తే స్వస్థలం ప్రతి ।
సాఽహం పంచదశాబ్దాని ప్రేతదేహే స్థితా కిల ॥ 164

క్షుత్తృడ్భ్యాం పీడితాఽత్యర్థదుఃఖితా స్వేన కర్మణా ।
తతః క్షుత్పీడితా నిత్యం శరీర వణిజస్యహమ్ ॥ 165

ప్రవిశ్య దక్షిణే ప్రాప్తా కృష్ణావేణ్యాస్తు సంగమే ।
తత్తీరం సంశ్రితా యావత్తావత్తస్య శరీరతః ॥ 166



శివవిష్ణుగణైర్దూరమపాకృశ బలాదహమ్ ।
తతః క్షుత్క్షామయా దృష్టో భ్రమంత్యా త్వం మయా ద్విజ ॥ 167

త్వద్ధస్తతులసీవారిసంస్పర్శగతపాతకా ।
తత్కృపాం కురు విప్రేంద్ర కథం ముక్తా భవామ్యహమ్ ॥ 168

యోనిత్రయాదగ్రభావ్యాత్ అస్మాచ్చ ప్రేమభావత ।
మాముద్ధర మునిశ్రేష్ఠ త్వామహం శరణం గతా ॥ 169

ఇత్థం నిశమ్య కలహావచనం ద్విజశ్చ ।
తత్పాపకమభయవిస్మయదుఃఖయుక్తః
తత్గ్లానిదర్శనకృపాచలచిత్తవృత్తిః
ధ్యాత్వా చిరం సువచనం నిజగాద దుఃఖాత్ 170

అంత నేను పిండములను పాడుపడ్డబాడిలో పారవైచితిని. అప్పుడు నా భర్త హాహాకారములు చేయుచు ఎంతో బాధడి నాతో, “ఆ పిండములను బయటకు తీయ వలదు,” అనెను. నేను ఆ పాడుపడ్డ నూతిలో దిగి యెత్తి, కడిగితిని. మరల నా భర్త, “వీటిని తీర్థమున వేయవలదు,” అనడముతో నేను ఆ పిండములను తీర్థమునందు సమర్పించితిని. ఇట్లు నేనెల్లప్పుడును కలహప్రియయై యున్నందున నా భర్త విసిగి వేసారి వేరే పెండ్లి చేసికొనుటకు పూనెను. అంత నేనే విషము మ్రింగి, ప్రాణములను విడిచితిని. యమకింకరులు వచ్చి నన్ను యమునివద్దకు తీసుకొనిపోయిరి. అచ్చట యముడు, “ఇది ఏమి శుభాశుభ కర్మములను చేసినది? చూడు,”మని చిత్రగుప్తుని ఆజ్ఞాపించెను. అందుకు చిత్రగుప్తుడు నన్ను నిందించుచూ, “ఇది చేసిన శుభకర్మ యొక్కటి యును లేదు. తాను మంచిభోజనము తిని, భర్తకు దుష్ట భోజనము పెట్టినందున, వల్గునీ గర్భమున తన మలమును తానే తినవలెనీ, వంటగదిలో రహస్యముగా తిండి తిన్నందున పిల్లియై తనబిడ్డలను తాను తిన వలయును. పతినుద్దేశించి, ఆత్మహత్య చేసికొనినందున అత్యంత నింద్యమగు ప్రేతశరీరము పొందదగినది. అందువలన ఎడారి దేశమున పంపదగినది. అచ్చట ప్రేత శరీరమున చిరకాలముండనీ, అటుమీద తక్కిన మూడుజన్మముల ననుభవించు గాక,” అని చెప్పినందుచేత, ఈ మరుభూమికి దూతలు నన్ను తీసికొనివచ్చి, ప్రేత దేహమునిచ్చి తమతావులకు వెడలిరి. ఆ నేను 15 సంవత్సరములు ప్రేతదేహ వాసినిగా ఉన్నాను. దప్పిచేతను, ఆకలిచేతను పీడింపబడినదై, ఆదుష్కర్మచే దుఃఖించుచు, ఆకలి నోర్వలేక ఒక వ్యాపారి శరీరమున ప్రవేశించి, దక్షణ దేశమున ‘కృష్ణా’ ‘వేణీ’ సంగమ ప్రదేశమందుండి, అచ్చట శివ, విష్ణు గణముల నుండి తరమబడి, ఆకలిచే కృశించుచు, తిరుగుచూ వచ్చి నిన్ను చూచితిని. నీ చేతి తులసీ జలమువలన పాపములు పరిహరించిపోయినవి. కాబట్టి, ఓ విప్రోత్తమా!

నేనెట్లు ముక్తురాల గుదును? ముందనుభవింపదగిన మూడు గర్భముల దుఃఖమును, ప్రేతదుఃఖమును ఎట్లు తొలగించు కొనెదను? నిన్నే శరణాగతియై నమ్మితిని నన్ను అనుగ్రహింపుము,” అని యిట్లు ప్రార్థించగా ధర్మధత్తుడు ఆ మాటలను విని, వాని పాపకర్మలచే భయాశ్చర్య దుఃఖములను పొంది, కరుణతో, బాధపడి, కొంతసేపు ధ్యానించి, మంచిమనసుతో చల్లని మాటల నిట్లనెను.

**ఇతి శ్రీశతకోటిరామచరితాంతర్గతే, శ్రీమదానందరామాయణే, వాల్మీకీయే, ఆదికావ్యే, సారకాండే, వృందాశాప కలహాఖ్యానం నామ, చతుర్థః సరః ॥**

**శతకోటి ప్రవిస్తరమైన రామకథలో, శ్రీమద్వాల్మీకి మహర్షిచే రచింపబడిన, ఆనంద రామాయణంలోని, సారకాండలో, వృందాశాప కలహఖ్యానమనే నాలుగవ సర్గ ముగిసినది.**

## శాంతి ఆశ్రమము

పూలు పరాగమం బొలుకబోయు సుగంధము సేకరించి పూ
జాలయ ధూపధూమముల నంతయు నంటగ రంగరించుచున్
గాలుపుఱేడు నల్దెసలు గ్రమ్మగ జిమ్మను తోటపల్లిశాం
త్యాలయమందు భక్తులు కృతార్థులుగారె తలంచి చూడగన్ 1

కంటకావృత భయంకరము సంకీర్ణకా
వనముగా దుద్యానవనము గాని
కుపితక్రూరంబులౌ గొంతులు వినరావు
కమ్రప్రార్థనపు గీతములు గాని
వాతాతపాది దుర్వాయుదోషము లేదు
హితవైన మందమారుతము గాని
దుర్గమశైలసందోహంబు గా దది
చరియింప ననునగు గిరులు గాని
దివ్యజలములు నింపును దిగుడుబావి
వనమయూరులు పురి విప్పుచును నటించు
కీరశారికాగణము సత్కృతులు బాడు
‘శాంతి ఆశ్రమ’ సద్వనప్రాంత నుంచు. 2

నెలవు విశాలమైనది యనేక లతౌషధకుంజపుంజతా
పలము ప్రశాంతదివ్యహితవైభవమొప్పిన పాఠశాల జ్ఞా
నలతలు పుష్పము ల్విరియు నవ్యపరీమళశోభితంబులై
వెలయు మనోహరంబులు నవీనము లందలి శాంతభావముల్. 3



# ఏకజీవ వాదము – దృష్టి-సృష్టి వాదము

(అక్టోబరు సంచిక తరువాయి)

–స్వామి బోధాత్మానంద సరస్వతి

## ప్రవచనం – 4

దృష్టి–సృష్టి వాదము మరియు ఏకజీవవాదము అనే పూర్వ ప్రవచనములో మేము ఒక సందేహమును వ్యక్తపరిచాము. తాడు–పాము ఉదాహరణలో ఏ సర్పమును మనము ప్రతిషేధిస్తున్నాము? ప్రాతిభాసిక సర్పమును ప్రతిషేధించలేము ఎందుకనగా దాని యొక్క ఉత్పత్తి వేదాంతములో అనిర్వచనీయ సర్ప ఉత్పత్తిగా అంగీకరించబడింది. వ్యావహారిక సర్పమును ప్రతిషేధించలేము. ఎందుకనగా అది లేదు కాబట్టి అప్రసక్త ప్రతిషేధ దోషము ఏర్పడుతుంది.

**సమాధానం :“వ్యావహారికత్వేన కల్పిత ప్రాతిభాసిక సర్ప తస్య నిషేధః”** అనగా భ్రాంతి సర్పముకు ఇది వ్యావహారికము అని భావిస్తున్న సత్యత్వము ఏదైతే ఉందో అది ప్రతిషేధించబడుతుంది. అదే విధంగా ఈ వ్యావహారిక జగత్ యందు పారమార్థికత్వ బుద్ధి ఏర్పడుతుంది. పారమార్థిక బుద్ధి అనగా ఆత్మ ఎంత సత్యమో ఈ జగత్ కూడా అంతే సత్యం. సాధారణంగా మనము ఆత్మ అని చెప్పాము కానీ నేను (అహం/చైతన్య) ఎంత సత్యమో జగత్ కూడా అంతే సత్యం. ఈ భావమును ప్రతిషేధించాలి. పారమార్థికత్వేన కల్పితం వ్యావాహారికం జగత్. వ్యావహారిక జగత్‌లో పరమార్థ బుద్ధి ఏర్పడుతుంది. దానిని ప్రతిషేధించాలి. స్వప్నం ఏ విధంగా సత్యం కాదు అని భావిస్తామో, అదే విధంగా ఒకవేళ జాగ్రత్యందు సత్యత్వబుద్ధి లభిస్తే ఇది సత్యం కావడానికి అవకాశం లేదు అని దాన్ని ప్రతిషేధించాలి. ఈ విషయము ఏ సమస్యలైతే ఉన్నాయి అని మనం భావిస్తున్నామో ఆ సమస్యలకు పరిష్కారము, స్వప్నము వలె ఎటువంటి సమస్యలు లేకుండా వ్యవహారము కొనసాగుతుంది. మరియు ఈ జగత్ అనేది పారమార్థిక సత్యంకాదు. అందువలన శృతిమాత చెబుతున్న “నేతి నేతి” వాక్యమును కూడా సమర్థించవచ్చును.

మరొక ప్రశ్న ఉద్భవించవచ్చు–ఈ ప్రపంచంలో ఉన్న అనేక రకాలైన అనుభవాలను ఏ విధంగా పరిగణిస్తారు? దృష్టి–సృష్టి అనగా నేను ఏదైతే చూస్తానో అది కల్పన చేస్తాను, నా జ్ఞానం ఏదైతే ఉందో దాని ప్రకారంగా నేను కల్పన చేస్తున్నాను అటువంటప్పుడు వివిధ రకాల అనుభవాలు ఎలా సాధ్యమవుతాయి? వివిధ రకాలు అనేవి అవిద్య వలన ఏర్పడినవి. ఒక అవిద్య అనేక రకాలైన ఉత్పత్తి చేయడానికి సామర్థ్యంను కలిగిఉంది. అందువలన నానాత్వం/అనేక విధాలు అనే అంశం చైతన్యము నుండి రావడంలేదు. అలాగే జీవుడి/జీవుల సామర్థ్యం నుండి కూడా రావడంలేదు. మూడు గుణాల వలన (సత్త్వ, రజస్, తమస్) మరియు వాటి

యొక్క వివిధ రకాలు అవిద్యకు ఆపాదించబడ్డాయి కావున నానాత్వం ఏర్పడింది. జగత్ వైచిత్ర్యమును ఏర్పరచడానికి అవిద్యకు లేదా మాయకు సామర్థ్యం ఉంది.

**తరువాత ప్రశ్న:** పూ.ప. ఘటం (కుండ) ఉంది, పటం (వస్త్రం) ఉంది. ఘటజ్ఞానం పొందాలంటే ఘటం అవసరం. పటజ్ఞానం పొందాలంటే పటం అవసరం. దృష్టి-సృష్టి వాదములో బాహ్యావస్తువు లేకుండా ఒక ఆలోచన ఎలా ఒక వస్తువును కలిగి ఉంటుంది? ఉదా: ఒక ఆలోచన ఘటము అని, మరొక ఆలోచన పటము అని, చివరికి రెండూ కూడా ఆలోచనలే. బహుజీవవాదములో ఒక ఆలోచన ఘటాకారవృత్తి ఎందుకంటే అక్కడ ఘటమనేది విషయము కనుక. మరొక ఆలోచన పటాకారవృత్తి ఎందుకంటే అక్కడ పటమనేది విషయము కనుక. దీనిని ఏ విధంగా వివరిస్తారు?

ఈ విషయమును ప్రతికర్మ వ్యవస్థ అంటారు. ఇక్కడ కర్మ అనగా ప్రారబ్ధ, సంచిత...కాదు. ఇక్కడ కర్మ అనగా వస్తువు (విషయము) యొక్క జ్ఞానము. ఘట జ్ఞానము యొక్క కర్మఘటము. పటజ్ఞానము యొక్క కర్మ (విషయము) పటము. ప్రతికర్మ అనగా ప్రతి ఆలోచనకు ఒక విషయము ఉంటుంది. ఆ విషయములో వైచిత్ర్యము అనేది ఉంటుంది. దృష్టి-సృష్టి వాదములో ఆలోచనలు ఎలా వైచిత్ర్యాన్ని పొందుతాయి.

**సిద్ధాంతి:** ఆలోచనలలో వైచిత్ర్యం అనేది స్వప్నంలో వలె సంస్కారాల వలన వస్తుంది. స్వప్నంలో వైచిత్ర్యం అనేది వస్తువుల వలన ఏర్పడటంలేదు. నాకు ఏవైతే సంస్కారాలున్నాయో అవి జాగృతం కావడం వలన నేను వైచిత్ర్యంను చూస్తున్నాను. ఎవరిలో అయితే కొన్ని విషయాలకు సంబంధించిన సంస్కారాలు ఉండవో ఎప్పుడూ దానిని స్వప్నంలో చూడరు. ఆ విషయాలు ఎప్పుడూ కూడా అధ్యస్థం కావు. ఎందుకంటే వాళ్ళెప్పుడూ వాటి గురించి ఆలోచించలేదు కనుక.

**పూ.ప:** కానీ సంస్కారాలకు సాదృశ్యం అనేది అవసరం. ఘట సంస్కారాలు రావాలంటే నేను ఘటమునకు సాదృశ్యమైన దానిని చూసినప్పుడే ఘటసంస్కారాలు వస్తాయి. పటసంస్కారాలు రావాలంటే పటమునకు సాదృశ్యమైన దానిని చూసినప్పుడే పట సంస్కారాలు వస్తాయి. అప్పుడు ఆ సంస్కారాలు దేనినైనా కల్పన చేయగలవు.

**సి:** అధ్యాస ఏర్పడాలంటే సంస్కారమనేది ముఖ్యమైనది. సాదృశ్యమనేది రెండవది. సాదృశ్యము ఒకవేళ ఉంటే అది అధ్యాసకు సహాయపడుతుంది. ఉదా:తాడు పాములాగా కనిపిస్తుంది. అందువలన పాము అధ్యాస ఏర్పడింది. లేదా పాము తాడులాగా కనబడుతుంది. అందువలన తాడు అధ్యాస అనేది ఏర్పడింది. ఏరకంగానైనా తీసుకోవచ్చు. శుక్తి (ఆల్చిప్ప), రజతము (వెండి) విషయములో



కూడా ఇది సమానము. కానీ అన్ని విషయములలో ఇది ఇలా ఉండదు. ఒకవేళ మేము ఆత్మ మరియు అనాత్మ అని చెప్పామనుకోండి. ఈ రెండింటి మధ్య సాదృశ్యం ఎక్కడ ఉంది? అయినా కూడా అధ్యాస ఉంది.

**పూ.ప:**ఆత్మ అనాత్మ మధ్య సాదృశ్యం అనేది లేదు. అందువలన అధ్యాస అనేది లేదు. రజ్జుసర్పము, శుక్తిరూప్యమువలె సాదృశ్యమనేది తప్పనిసరి. సాదృశ్యం లేకపోతే అధ్యాస అనేది లేదు. అందువలన ఆత్మ మరియు అనాత్మ అధ్యాస అనేది లేదు.

**సి.:**అధ్యాసకు సాదృశ్యం అనేది అవసరం లేదు. ఉదా:పీతః శంఖః శంఖములో పీతవర్ణమును చూసినప్పుడు, శంఖమునకు, పీతవర్ణమునకు సాదృశ్యమనేది లేదు. కానీ అధ్యాస అనేది ఏర్పడుతుంది.

**పూ.ప:** శ్వేతవర్ణానికి పీత వర్ణానికి సాదృశ్యం ఉంది. శంఖము యందు కృష్ణ వర్ణము అధ్యస్థ కావడంలేదు. కాబట్టి సాదృశ్యమనేది అవసరం. పీతః శంఖః ఇందులో శంఖమనేది అధిష్ఠానం, పీతత్వము అధ్యస్థమయినది. అయితే అది కేవలం శంఖము కాదు శ్వేత శంఖము, ఆ శ్వేత వర్ణములో సాదృశ్యము కారణముగా పీతవర్ణము అధ్యస్థమయింది. అలాగే పచ్చకామెర్లు అనే దోషము కూడా ఉంది.

**సి:** సాదృశ్యము అంతగా అవసరం లేదు. స్వప్నంలో సాదృశ్యము ఎక్కడ ఉంది? స్వప్నములో జడ వస్తువుల అధ్యాస ఏర్పడుతుంది. చైతన్య వస్తువుల అధ్యాస ఏర్పడుతుంది. జాగ్రత్‌లో నాకు నచ్చని వ్యక్తులను కూడా నేను స్వప్నంలో, నా సొంత ప్రపంచములో అధ్యస్థం చెందుతున్నాను. అనగా నేను అవి అవుతున్నాను. జాగ్రత్‌లో నేను వాటిలాగ ఉండాలని ఎప్పుడూ ఆలోచించలేదు. కానీ నేను అవి (జడ, చేతన వస్తువులు) అయ్యాను. అధ్యాసయొక్క ముఖ్యమయిన పదార్థం సంస్కారము. సంస్కారములు మిథ్యా వస్తువు నుండి కూడా రావచ్చు. సంస్కారములు సత్య వస్తువు నుండి మాత్రమే రావాలని నియమం ఏమీలేదు. భ్రాంతి ప్రపంచం భ్రాంతి సంస్కారాలను సృష్టిస్తుంది. భ్రాంతితో కూడిన స్వప్నము యందు ఈ సంస్కారములు అధ్యస్థమవుతున్నాయి, లేదా ఈ సంస్కారాలు బ్రహ్మ చైతన్యము యందు అవిద్యా ఉపాధి ద్వారా అధ్యస్థమవుతున్నాయి. వైచిత్ర్యం అనేది ఏర్పడుతుంది. అధ్యాస యొక్క ముఖ్యమైన పదార్థం సంస్కారం. సాదృశ్యం అనేది అంత ముఖ్యం కాదు.

ఎవరియొక్క కల్పన ఈ దృష్టి-సృష్టియో ఆ జీవుడు ఏకజీవుడు. ఈ రకముగా దృష్టి-సృష్టి వాదము ఏకజీవ వాదము కలయిక ఏర్పడింది. అనగా అవి రెండు కాదు. ఒక కల్పకుడు (కల్పన చేసేవాడు) ఉన్నప్పుడు మాత్రమే దృష్టి-సృష్టి సాధ్యమవుతుంది. ఒకవేళ ఒకే విశ్వంలో అనేకమంది వ్యక్తులు కల్పన చేస్తున్నారను

కోండి అప్పుడు వాళ్ళు వేరు వేరు వస్తువులను కల్పన చేస్తారు, ప్రతి ఒక్కరు ఈశ్వరులు అవుతారు. ఇక్కడ కల్పకుడు కేవలం ఒక్కడే. ఈశ్వరుడు అనగా ప్రతి ఒక్కరు సమర్థులు, అప్పుడు వ్యవస్థ అనేది అస్తవ్యస్థమవుతుంది. అందువలన జీవుడు ఒక్కడే, ప్రతీఒక్కరు అధ్యాసను చేయవచ్చు, దానికి వారే బాధ్యులు, వారు ప్రభావితం చెందుతారు. ఒకవేళ నేను మంచిని అధ్యాస చేస్తే నేను ప్రయోజనం పొందుతాను. ఒకవేళ నేను చెడును అధ్యాస చేస్తే నేను దుఃఖిస్తాను. బహుజీవ వాదములో కొంత స్వేచ్ఛను అందరు జీవులకు ఇవ్వడం జరిగింది. ఏకజీవ వాదములో ఒకే జీవుడు, ముఖ్యజీవుడు అతడే హిరణ్యగర్భ. అతనే ఈ ప్రపంచాన్నంతటినీ కల్పన చేస్తున్నాడు. నేను హిరణ్యగర్భనా లేక అతని ప్రపంచంలో నేను కల్పననా అని ఆలోచించడంలో కల్పనగానే ఉండాలనుకుంటున్నారా? జీవుడు తన యొక్క సాధనలో అభివృద్ధి చెంది ఈ జ్ఞానము వికసించే వరకు అతనికి ఈ అవకాశం ఉంది అని కూడా తెలియదు. ఇదే నేను, అనేకమంది ప్రజలు ఉన్నారు, అందరూ వేరు వేరు జీవులు. అందరూ సంతోషాన్ని పొందడానికి ఏదో ఒకటి చేస్తున్నారు. అనేకమంది ఈరకంగా జీవిస్తారు. అలాగే వాళ్ళ యొక్క సొంత చిన్న జీవితంను సృష్టించు కుంటారు. ఎప్పుడైతే నేను పరిణతి చెందుతానో అప్పుడు నేనే ఈ సృష్టికి కల్పకుడిని, నేను హిరణ్యగర్భను అని అర్థం చేసుకుంటాను. నాకంటే వేరైనది ఏదైనా కూడా అవన్నీ కల్పితం. నేను కల్పకుడిని. ఈ కల్పనను మరియు నన్ను ఏ విధంగా విభజంచగలుగుతాను. అహం ఎక్కడైతే ఉంటుందో అదే ముఖ్యమైన జీవుడు. అహం దృష్ట్యా చూస్తే అన్నీ కూడా 'అయం' (వీరు), ఈ దేవదత్త, ఈ చైత్ర, ఈ మైత్ర, వీళ్ళందరి నుండి నేను వేరు. అన్నింటిలోనూ అయం (ఇది) అనేది ఉంది, ఇవి, అవి, ఆ రెండు, ఈ రెండు, వీళ్ళు, వాళ్ళు మొ... ఈ ముఖ్యజీవుడు సృష్టిని కలిగి ఉన్నాడు.

ఏకజీవవాదము యొక్క సిద్ధాంతం ఏమిటి? ఒక జీవుడు, అనేక దేహాలు, అనేక అంతఃకరణలు, అనేక స్థూల శరీరాలు. అనేక సూక్ష్మశరీరాలు, ఒక చైతన్యము, ఒక అవిద్య. ఈ జీవుడుఅంతా కల్పన చేశాడు. దృష్టి-సృష్టి వాదములో మనం ఏవైతే అర్థం చేసుకున్నామో అవన్నీ కూడా ఏకజీవవాదమునకు కూడా వర్తిస్తాయి. ఏకజీవవాదము మరియు దృష్టి-సృష్టి వాదము యొక్క ఆరంభము వేరు అని మనం అనుకోవచ్చు. కానీ ఈ రెండూ ఒకటే. రెండింటి కలయిక త్వరలోనే ఏర్పడుతుంది. ఎందుకంటే రెండింటి యొక్క ఉదాహరణ స్వప్నం, ప్రాతిభాసిక వస్తు, భ్రాంతి ప్రపంచం. ఈ ఏకజీవుడు కల్పకుడు, మిగతా జీవులందరూ కల్పితం. ఈ జీవుడి విషయానికొస్తే జీవన్ముక్తి అనేది లేదు. ఆ జీవుడికి కేవలం విదేహముక్తి మాత్రమే



ఉంటుంది. ఆ ముఖ్యజీవుడు ఎప్పుడైతే సుషుప్తి లోకి వెళతాడో అదే మిగతి అంతః కరణలన్నింటికి ప్రళయం, అప్పుడు అనుభవాలనేటువంటివి ఉండవు. ఆ జీవుడికి జ్ఞానోదయం కలగడం అనేది కూడా స్వప్నంలోనుండి మేలుకోవడమే. ముఖ్యజీవుడు మేలుకున్నప్పుడు అతని కల్పన అంతా ఏమవుతుంది? నేను నా స్వప్నం నుండి మేలుకున్నపుడు నా స్వప్నంలో ఉన్న వ్యక్తులందరూ ఏమైపోయారు? భండారలో స్వీట్లు, మొ॥పదార్థాలను, వడ్డిస్తూ ఉన్నారు, అప్పుడే మేలుకున్నారు. స్వీట్లు తీసుకున్నవాళ్ళందరూ ఎక్కడ? అది అయిపోయింది, నీవు దానిని అడగవద్దు. మనం నిద్రలోంచి మేలుకోగానే స్వప్నంలోఉన్న వాళ్ళందరికీ ఏమైంది అని అడగము. ఆకల్పన పూర్తయింది. అదే విధంగా ముఖ్యజీవుడు ఎప్పుడైతే మేలుకుంటాడో ఈ జగత్ అంతా పోతుంది.

మహాభారతంలో కర్ణుడు నేను రాధకుమారుడిని అంటాడు. కాని వాస్తవానికి అతను కుంతీపుత్రుడు, కౌంతేయ రాధేయుడినని ఎలాగైతే ఆలోచిస్తాడో అలాగే బ్రహ్మ, నేనుజీవుడిని అని అనుకుంటాడు.

**(శాంతి ఆశ్రమము 11వ పేజీ తరువాయి....)**

ఆత్మ కానందదాయక మైనమలుపు
"శాంతిఆశ్రమ" పదము విశ్రాంతి గొలుపు
కలత జెందని జీవితగతులు దెలుపు
మౌనము గరపు నుఱుములు లేని మెఱుపు. 4

లోకు లనేకభావనలలో పరతత్వ మెఱింగి సత్కథా
నీకము లుగ్గడింతు రవనీతల మందు ననేకపోకడుల్
రాక గృహస్తు లాశ్రితశరణ్యులు ఆర్యులు మార్గమందు చీ
కాకులుగల్గనీయని సుఖస్థితిగాంచిరి శాంతికాములై. 5

హృదయాంతర్ముఖనిశ్చలత్వమున సౌహృద్భావ మేకత్వ మ
భ్యుదయానందపదంబు జేర్చునని సంబోధించు సృష్టించు నె
మ్మదికిన్ శాంతి విశాలదృక్పథసమామ్నాయంబులం బత్యుత్తమం
బిది యోగాశ్రమవాసయోగ్యమగు శాంతాగారమాగాహియై. 6

**కవితా మంజూష**
**గ్రంథకర్త**
**సహజకవితా విలాస**
**నిమ్మకాయల సుబ్బారావు, కాకినాడ**

# సర్వ వేదాంత సిద్ధాంత సారసంగ్రహం

**॥ఓం॥**

**శ్రీమత్పూజ్యభగవత్పాదశఙ్కరాచార్యవిచరితః**

**శఙ్కరప్రసాదినీ టీకా సహితః (పూజ్యశ్రీ బోధాత్మానంద సరస్వతి స్వామి)**

## సాధనచతుష్టయమ్

**అనుబన్ధస్య ప్రథమాఙ్గం సాధన చతుష్టయం వర్ణ్యతే ।**

అనుబంధము యొక్క ప్రథమ భాగము అయిన సాధన చతుష్టయమును వివరిస్తున్నారు.

**సాధన చతుష్టయసమ్పత్తిర్యస్యాస్తి ధీమతః పుంసః।**
**తస్యైవైతత్ఫలసిద్ధిర్నాన్యస్య కిఞ్చిదూనస్య ॥13॥**

సాధన చతుష్టయము కలిగి ఉన్న పురుషుడికి లేదా బుద్ధిమంతుడికి మాత్రమే ఫలితము లభిస్తుంది. ఇతరులకు లభించదు.

**యస్య ధీమతః పుంసః బుద్ధిమన్నరస్య సాధనచతుష్టయసమ్పత్తిరస్తి తస్యైవ। సాధనచతుష్టయసమ్పన్నస్యైవైతత్ఫలసిద్ధిః ఫలస్య మోక్షస్య సిద్ధిర్భవతి నాన్యస్య కిఞ్చిదూనస్య । యదా ప్రమాతరి దోషాః సన్తి తదా శాస్త్రాచార్యసత్త్వేఽపి నిర్దుష్టప్రమేయస్య ప్రమా సంశయవిపర్యయ ప్రతిబద్ధా భవతి।**

**"నిర్దోషం హి సమం బ్రహ్మ" ఇతి స్మృతేః, "యస్య నాస్తి స్వయం ప్రజ్ఞా శాస్త్రం తస్య కరోతి కిమ్। లోచనాభ్యాం విహీనస్య దర్పణం కిం కరిష్యతి" ఇతి లోకోక్త్యా సాధనచతుష్టయసమ్పత్తేరనివార్యతోక్తా ।**

ఏ బుద్ధిమంతులు, నరులు సాధనచతుష్టయసంపత్తిని కలిగిఉన్నారో ఆ సాధన చతుష్టయ సంపన్నులు మాత్రమే దానియొక్క ఫలితము అయిన మోక్షమును పొందుతారు. ఇతరులు అనగా సాధనచతుష్టయంలో ఏ మాత్రం లోపం ఉన్నా, వారు మోక్షమును పొందలేరు. శాస్త్రం ఉంది, ఆచార్యులు ఉన్నారు, వీరు జీవుడు బ్రహ్మ ఒకటే అనే విషయమును స్పష్టంగా నిర్దేశిస్తున్నప్పటికి, సాధకుడిలో చిత్తశుద్ధి లేకపోవడం వలన రాగద్వేషాలు ఉన్నందున ప్రతిబద్ధ జ్ఞానం లభిస్తుంది. అనగా సందేహాలు, విపరీత భావనలతో కూడిన జ్ఞానం లభిస్తుంది. "బ్రహ్మయందు ఎటువంటి దోషాలు లేవు," బ్రహ్మ సమం అని స్మృతి తెలియజేస్తుంది. "వ్యక్తి తనంతట తానుగా ప్రజ్ఞావిహీనుడైనప్పుడు శాస్త్రం ఏం చేస్తుంది, ఉదాహరణకు వ్యక్తి అంధుడైతే అద్దం ఏం చేస్తుంది". ఈ లోకోక్తి ద్వారా సాధనచతుష్టయ సంపత్తి తప్పనిసరి అని తెలుస్తుంది.



**తదేవాన్వయవ్యతిరేకేణ విశదయతి చత్వారీతి –**

దానినే అన్వయ వ్యతిరేకము ద్వారా స్పష్టపరుస్తున్నారు.

**చత్వారి సాధనాన్యత్ర వదన్తి పరమర్షయః ।**
**ముక్తిర్యేషాం తు సద్భావే నాభావే సిధ్యతి ధ్రువమ్ ॥14॥**

పరమఋషులు ఇక్కడ నాలుగు సాధనలు ఉన్నాయి అని తెలిపారు. ఈ సాధనలు ఉంటేనే ముక్తి లభిస్తుంది, ఇవి లేకపోతే ముక్తి లభించదు అని నిశ్చయముగా స్పష్టీకరించారు.

**పరమర్షయః పరమమృతమజంమాయాసఙ్ఖ్యాతురీయం చతుర్థమృషన్తి జానన్తీతి ఋషయోఽత్రాస్మి న్ముక్తి విషయే చత్వారి సాధనానీత్యుక్త్వా సాధనచతుష్టయ సమ్పత్తేరనివార్యతాంవదన్త్యన్వయవ్యతిరేకేణేతి । యేషాం సాధనానాం సద్భావే తు ముక్తిర్ముక్తేః సద్భావః సాధనచతుష్టయాభావే ముక్తిర్న సిధ్యతి। ఏతద్ధ్రువంసునిశ్చితం శ్రుత్యుపపత్త్యనుభూతిభ్యః సిద్ధమిత్యర్థః ।**

పరమఋషయః అనగా పరమము, సత్యము, జన్మలేనిది, మాయాసంఖ్యా తురీయం చతుర్థం (జాగ్రదవస్థ అభిమాని కాదు, స్వప్నావస్థ అభిమాని కాదు, సుషుప్తి అవస్థ అభిమాని కాదు, వీటన్నింటికీ అతీతంగా ఉన్నదే తురీయం అదే చతుర్థం, ఈ చతుర్థం అనే సంఖ్య మాయ ద్వారా ఏర్పడినది) ను తెలుసుకున్న వారు ఋషులు. ఇక్కడ ముక్తి విషయములో నాలుగు సాధనలను తెలియజేసి, సాధన చతుష్టయ సంపత్తి అనేది అత్యంత ముఖ్యం అని అన్వయ వ్యతిరేకము ద్వారా తెలియజేస్తున్నారు. ఈ సాధనలు ఉన్నప్పుడే ముక్తి లభిస్తుంది, సాధన చతుష్టయం లేకపోతే ముక్తి లభించదు. ఇది శృతి, ఉపపత్తి (యుక్తి), అనుభూతి ద్వారా ధృవముగా నిశ్చయముగా సిద్ధం.

**యదష్టమశ్లోకే సూత్రరూపేణోక్తం తదేవాధునా విస్తారితమాద్యమితి।**

ఎనిమిదవ శ్లోకంలో సంక్షిప్త రూపములో ఏదైతే చెప్పబడినదో దానినే ఇక్కడ వివరిస్తున్నారు – ఆద్యం.

**ఆద్యం నిత్యానిత్యవస్తువివేకః సాధనం మతమ్ ।**
**ఇహాముత్రార్థఫలభోగవిరాగస్తు ద్వితీయకమ్ ॥15॥**
**శమాదిషట్కసమ్పత్తిస్తృతీయం సాధనం మతమ్ ।**
**తురీయం తు ముముక్షుత్వం సాధనం శాస్త్రసమ్మతమ్ ॥16॥**

మొదటిది వివేకము అనగా నిత్య అనిత్య వస్తువును వేరు చేయడం, రెండవది వైరాగ్యము అనగా ఈ లోకంలో మరియు పరలోకంలో లభించే భోగాలయందు

ఆసక్తి లేకపోవడం, మూడవది శమ, దమ, ఉపరమ, తితిక్షా, శ్రద్ధా, సమాధానం, నాలుగవది ముముక్షుత్వం ఈ నాలుగు సాధనలు శాస్త్ర సమ్మతమైనవి.

స్పష్టోऽర్థః।

**తథాహి – "తద్యథేహ కర్మచితో లోకః క్షీయత ఏవమేవాముత్ర పుణ్యచితో లోకః క్షీయత" ఇతి శ్రుత్యా "యత్కృతకం తదనిత్యమ్" ఇత్యాది న్యాయాచ్చ "న జాయతే మ్రియతే వా విపశ్చిత్", "యో వై భూమా తదమృతమ్", "అతోऽన్యదార్తమ్" ఇత్యాదిశ్రుత్యా చ స్వే మహిమ్ని ప్రతిష్ఠితో భూమాऽऽత్మా నిత్యమృతం తతోऽన్యదనిత్యం మూలావిద్యా తత్కార్యఞ్చేతి వివేక ఉపలభ్యతే జాయతే।**

ఈ ప్రకారంగా –"ఈలోకములో కర్మ ద్వారా పొందినది ఏదైతే క్షీణించిపోతుందో, అదే విధంగా పరలోకములో పుణ్యము ద్వారా పొందినది క్షీణించిపోతుంది'' (ఛా. ఉ:8.1.6) అని శృతి ద్వారా తెలుపబడింది. "ఏదైతే ఉత్పత్తి అయినదో అది అనిత్యం" అని యుక్తి ద్వారా తెలిపారు. "ఆత్మకు జన్మ లేదు, మరణం లేదు" (క.ఉ:1.2.18), "ఏదైతే భూమాఅనగా ఆనందమో అదే అమృతం (ఛా.ఉ:7.124.1), "అందువలన మిగతావన్నీ కూడా మిథ్యా" (బృ.ఉ:3.7023), మొదలైన శృతుల ద్వారా అనంతమైన ఆత్మ తనయొక్క మాహాత్మ్యములో ప్రతిష్ఠితమవుతుంది. ఈ ఆత్మ నిత్యం, అమృతం అందువలన మిగతావన్నీ అనగా మూలవిద్య మరియు దాని కార్యం అన్నీ మిథ్యా అనే వివేకము ఉత్పన్నమవుతుంది.

యత్కర్మణా సమ్పాదితం తద్భోగ్యం భోగాయతనఞ్చేహలోకపరలోక విషయజాతం సర్వమనిత్యమిత్యర్థః। "పరీక్ష్య లోకన్కర్మచితాన్బ్రాహ్మణోనిర్వేదమాయాన్నాస్త్యకృతః కృతేన", "ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి", స యోऽన్యమాత్మనః ప్రియం బ్రువాణం బ్రూయాత్ప్రియం రోత్స్యతీతి" ఇత్యాదిశ్రుత్యాऽనాత్మ మాత్రం పరీక్ష్య, అనిత్యత్వేన నిశ్చిత్య, అకృతో మోక్షః కృతేన కర్మణా నాస్తీతి ముముక్షోః కర్మభ్యస్తత్ఫలేభ్యశ్చ వైరాగ్యముపజాయతే ।

ఏదైతే కర్మ ద్వారా సంపాదించబడిందో ఆ భోగ్యం (వస్తువులు, వ్యక్తులు, దేశ, కాల...) మరియు శరీరం, ఈ లోకములోనూ పరలోకములోనూ ఉన్నటువంటి విషయ సమూహము సర్వం అనిత్యం.

"బ్రాహ్మణుడు కర్మఫలమైన లోకాలను పరీక్షణం చేసి వైరాగ్యం పొందాలి, ఎందుకనగా ఉత్పత్తి అయిన దాని ద్వారా ఉత్పత్తి లేని వస్తువును పొందలేము" (ము.ఉ :1.2.12), "నాకోసం సర్వాన్ని ఇష్టపడుతున్నాను" (బృ.ఉ: 2.4.5), "ఆత్మ ప్రియతమము అని తెలిసిన అతడు, అనాత్మ ఆత్మకంటే ప్రియమైనది అని చెప్పువానితో, ప్రియము నశించగలదు అని చెప్పవలెను" (బృ. ఉ:1.4.8). మొదలైన



శృతులద్వారా కేవలం అనాత్మను పరీక్షణం చేసి, ఈ అనాత్మ అనిత్యం అని నిశ్చయముగా తెలుసుకొని ఉత్పత్తిలేని మోక్షము, ఉత్పత్తి కలిగిన కర్మ ద్వారా పొందలేరు అని అర్థం చేసుకున్న ముముక్షువులలో కర్మనుండి మరియు కర్మఫలము నుండి వైరాగ్యం పుడుతుంది, జనిస్తుంది.

**"శాన్తో దాన్త ఉపరతస్తితిక్షుః సమాహితో భూత్వాऽऽత్మ న్యేవాऽऽత్మానం పశ్యతి" ఇతి శ్రుత్వాకాణ్వపాఠే శమాదిపఞ్చకం లభ్యతే। "శ్రద్ధావిత్తో భూత్వా...పశ్యేత్" ఇతి మాధ్యన్దినపాఠః। ఏతేన శమాదిషట్కముక్తమ్।** "శాంతుడు, దాంతుడు, ఉపరతుడు, తితిక్షువు, సమాహితుడు అయి తనయందే తనను దర్శించును" (4.4.23) అని కాణ్వ శాఖలో శమాది పంచకం లభ్యమైనది. శ్రద్ధ కలిగినటువంటి వారు... దర్శించును, అని మాధ్యందిన శాఖలో తెలిపారు. వీటిద్వారా శమ మొదలుకొని ఆరు సంపత్తులను చెప్పారు.

"తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మేతి", "సోऽన్వేష్టవ్యఃస విజిజ్ఞాసితవ్యః", "ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్యః" ఇత్యాదిభిర్ముముక్షుత్వం లభ్యతే।

"దానిని తెలుసుకోవాలనే ఇచ్ఛను కలిగి ఉండు, అదే బ్రహ్మ" (తై.ఉ:3.1), దానిని అన్వేషణం చేయాలి, తెలుసుకోవాలనే కోరిక కలిగి ఉండాలి" (ఛా.ఉ:8.7.1), "ఆత్మను దర్శించుకోవాలి, శ్రవణం చేయాలి, మననం చేయాలి, నిదిధ్యాసనం చేయాలి" (బృ.ఉ:2.4.5) మొదలైన శృతుల ద్వారా ముముక్షుత్వం లభ్యమవుతుంది. అద్వైతాత్మని వేదాన్త ఏవ ప్రమాణమ్ "తం త్వౌపనిషదం పురుషం పృచ్ఛామి", "వేదాన్తవిజ్ఞానసునిశ్చితార్థాః" ఇత్యాదిశ్రుతిషు దర్శితమితి।

అద్వైత ఆత్మను తెలుసుకోవడంలో వేదాంతం మాత్రమే ప్రమాణం. "ఆ ఉపనిషద్ ప్రతిపాద్యమైన పురుషుడి గురించి ప్రశ్నిస్తున్నాను" "వేదాంతజ్ఞానమును నిశ్చయముగా తెలుసుకున్నవారు" (కై.ఉ:1.6) మొదలైనవి శృతులలో ప్రదర్శించబడినవి

**పరిగతపరమార్థాన్ పండితాన్ మాऽవమంస్థాః**
**తృణమివ లఘులక్ష్మీర్నైవ తాన్ సంరుణద్ధి!**
**అభినవమదరేఖాశ్యామగండస్థలానాం**
**న భవతి బిసతంతుర్వారణం వారణానామ్ ॥ 13**

తా॥ తత్వజ్ఞులైన పండితుల నెవరూ అవమానించకండి! గడ్డిపోచవంటి మీ సంపద వాళ్ళను కట్టివేయలేదు. క్రొత్తగా మదజలం కారడంవల్ల నలుపెక్కిన చెక్కిళ్ళు గల మదగజాలను తామరతూటి దారం బంధింపలేదు గదా!

**–భర్తృహరి నీతి శతకం**

## దక్షిణామూర్తి స్తోత్రం

(గత సంచిక తరువాయి) **మానసోల్లాసం**

**రచన: దక్షిణామూర్తి స్తోత్రం - భగవత్పాదులు శ్రీ ఆది శంకరాచార్యులు**
**మానసోల్లాసము-శ్రీ సురేశ్వరాచార్యులు, టీకా - శ్రీ రామతీర్థగారు,**
**ఆంగ్ల మూలం - పూజ్య స్వామి బోధాత్మానంద గారు.**

ఒకవేళ జీవుడు ఈశ్వరుల మధ్య తాదాత్మ్యం ముఖ్యము, విరోధము ఆభాస మాత్రం అయితే దీనికి సంబంధించి మరొక ప్రశ్న ఉద్భవిస్తుంది.

ఒకవేళ జీవుడు మరియు ఈశ్వరుడి మధ్య ఐక్యం ఉంటే ఎందుకు సాధ్యం కాదు? జీవుడు మరియు ఈశ్వరుడి మధ్య విరోధాలను తెలియజేస్తున్నారు.

**సర్వజ్ఞస్సర్వకర్తా చ కథమాత్మా భవిష్యతి।**
**శిష్యం ప్రతీత్థం పృచ్ఛంతం వకుమతమారభతే గురుః ॥7॥**

సర్వజ్ఞః=సర్వజ్ఞుడు, సర్వకర్తా=సర్వమును సృష్టించేవాడు, చ= మరియు, కథం= ఎలా?, ఆత్మ=జీవాత్మ, భవిష్యతి= అవుతాడు, శిష్యం ప్రతి =శిష్యునికి, ఇత్థం= ఈ విధంగా, పృచ్ఛంతం=అడుగుతున్న, వక్తుం=చెప్పడం కోసం, ఆరభతే= ప్రారంభిస్తు న్నాడు. గురుః= గురువు. జీవాత్మ సర్వజ్ఞుడు, సర్వకర్త ఎలా అవుతాడు అని శిష్యుడు గురువును ప్రశ్నించగా గురువు వివరిస్తున్నాడు.

నేనెలా సర్వజ్ఞుడను అవుతాను, ఈ సృష్టికంతటికీ కర్తను నేనెలా అవుతాను? నేను అంతటా వ్యాపించి ఉన్నానని నేనెప్పుడూ కూడా ఆలోచించలేదు. నేనెప్పుడూ అసంసారినని ఆలోచించలేదు. జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలలోకి మార్పు చెందుతూ ఉన్నాను, ఒక శరీరం నుండి మరొక శరీరానికి, ఒక యోని ఉండి మరొక యోనికి మార్పు చెందుతూ ఉంటాను. అలాంటప్పుడు నేనెలా సర్వజ్ఞుడిని, సర్వకర్తను అవుతాను? లేదా సర్వజ్ఞ సర్వకర్త ఈశ్వర జీవుడెలా అయ్యాడు?

ఇంతటితో ప్రశ్నలు పూర్తయ్యాయి. ఇప్పుడు ఈ ప్రశ్నలకు సమాధానముగా దక్షిణామూర్తి స్తోత్రమును వివరిస్తున్నారు. మొదటి శ్లోకములోనే అన్ని సమాధానములు ఉండవు, అలాగే ఒకే క్రమములో సమాధానములు ఉండకపోవచ్చు.

శిష్యుడికి అర్థం చేసుకునే సామర్థ్యం ఉంది కనుకనే గురువు సమాధానాలు చెబుతున్నాడు. సామర్థ్యం లేనివారికి వేదాంతమును బోధించకూడదు అని సంప్రదాయం. సామర్థ్యం ఉన్నవారికి వేదాంతమును అందించకపోవడం కూడా సరికాదు, అనగా సామర్థ్యం ఉన్నవారికి తప్పనిసరిగా బోధించాలి అని ముండకోప నిషత్ చెబుతుంది. "తస్మై స విద్యానుపసన్నాయ సమ్యక్ ప్రశాంత చిత్తాయ శమాన్వితాయ, యేనాక్షరం పురుషం వేద సత్యం ప్రోవాచ తాం తత్త్వతో బ్రహ్మవిద్యాం.

"అస్తి ప్రకాశత ఇతివ్యవహారః ప్రవర్తతే।తచ్చాస్తిత్వం ప్రకాశత్వం కస్మిన్నర్థే ప్రతిష్ఠితం ॥



కిం తేషు తేషు వార్థేషు కిం వా సర్వాత్మనీశ్వరే ।

4వ శ్లోకము మరియు 5వ శ్లోకములోని పూర్వార్థములోని ప్రశ్నలు 1.అస్తిత్వము ప్రకాశత్వము దేనికి చెందినవి? 2.ఈ అస్తిత్వము, ప్రకాశత్వము ప్రతి వస్తువులో ఉన్నాయా? లేదా 3.సర్వాత్మ ఈశ్వరుడిలో ఉన్నాయా? అనే ప్రశ్నలకు ప్రత్యక్షముగా సమాధానం దక్షిణామూర్తి ప్రథమ శ్లోకమునందు వివరించబడినది.

**విశ్వం దర్పణ-దృశ్యమాన మాన-నగరీ తుల్యం నిజాంతర్గతం**
**పశ్యన్నాత్మని మాయయా బహిరివోద్భూతం యథా నిద్రయా ।**
**యస్సాక్షాత్కురుతే ప్రబోధసమయే స్వాత్మానమే వాద్వయం**
**తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥1॥**

విశ్వం =నామరూపాలతో కూడిన జగత్, దర్పణదృశ్యమాన నగరీతుల్యం= అద్దములో చూస్తున్న నగరము వంటిది, నిజాంతర్గతం=తన యొక్క అంతరంగములో, పశ్యన్= చూస్తున్నాడు/గుర్తిస్తున్నాడు. ఆత్మని =ఆత్మయందు, మాయయా= మాయ ద్వారా, బహిః= బయట, ఇవ=లాగా, ఉద్భూతం= ఉత్పత్తి అయింది, యథా= ఏ రకంగానైతే, నిద్రయా= నిద్రలో, యః=ఎవరైతే, సాక్షాత్ కురుతే = సాక్షాత్కారం పొందుతున్నారో, ప్రబోధసమయే= మేలుకున్న సమయములో, స్వాత్మానం= తనను తాను, ఏవ=మాత్రమే, అద్వయం=అద్వైతము/మార్పులేనిది, తస్మై శ్రీ గురుమూర్తయే = ఆ గురువుకి, నమః=నమస్కరిస్తున్నాను. తస్మై=ఆ, శ్రీగురుమూర్తయే= పరమ గురువుకి, శ్రీ దక్షిణామూర్తయే=శ్రీదక్షిణామూర్తికి, ఇదం నమః=ఈ నమస్కారములు.

తన స్వరూపాన్ని సాక్షాత్కార సమయమున అనుభవించువాడు, ఆ అచంచలమైన ఆత్మలోనే ఈ పేర్లు, రూపాలు కలిగిన జగత్తు కేవలం మాయాశక్తి వల్ల అద్దంలో కనిపించే నగరంలా, స్వప్నంలా బయటి ప్రపంచంలా ప్రత్యక్షమవుతుంది అని తెలిసినవాడు-ఆ దివ్యగురువైన శ్రీ దక్షిణామూర్తికి నా నమస్కారం.

దక్షిణదిశకు ముఖము చేసి ఉన్నవారు దక్షిణామూర్తి. దక్షిణ దిశలో మృత్యుదేవత ఉంటారు. అందుకే ఇంట్లో కూడా తూర్పుదిశకు ముఖం చేయాలి. దక్షిణదిశకు ముఖం చేయకూడదని, దక్షిణదిశకు పడుకోకూడదని అంటుంటారు. నివృత్తి మార్గమును ఎంచుకున్న సనత్కుమారులు మొదట జ్ఞానము కొరకు పరమశివుడిని ఆశ్రయించారు. అప్పుడు పరమ శివుడు దక్షిణామూర్తి రూపమును ధరించి, చిన్ముద్రలో ఉపదేశమును అందించాడు. ఈ సనత్కుమారులు పరమహంస పరివ్రాజకాచార్యులు వారి నుండి ఈ జ్ఞానము పరంపరగా కొనసాగుతూ వస్తుంది. అందువలన

**సదాశివసమారంభాం శంకరాచార్యమధ్యమాం।**
**అస్మదాచార్యపర్యంతాం వందే గురుపరంపరాం ॥**

మనం చదువుతాము. **శ్రీ దక్షిణామూర్తిః– శ్రీమాన్సు అసౌ దక్షిణామూర్తిశ్చ ఇతి శ్రీ దక్షిణామూర్తిః శ్రీమాన్– శ్రీ** తత్త్వబోధాత్మికా ఆవిష్కృతా శోభ **అస్మిన్ అస్తి ఇతి శ్రీమాన్.** ఎవరిలో అయితే శ్రీ అనగా సంపద ఉందో వారిని శ్రీమాన్ అంటున్నారు. సంపద అనగా తత్త్వ జ్ఞానము యొక్క ఆవిష్కరణము. అనగా తత్త్వజ్ఞానమును తెలిసినవారిని శ్రీమాన్ అంటున్నారు. సంపదను కలిగి ఉండి, దక్షిణ దిశకు ముఖం చేసిన వారే శ్రీ దక్షిణామూర్తి. **గురుః – గృణాతి తత్త్వజ్ఞానం ఉపదిశతి శిష్యేభ్యః ఇతి గురుః** తత్త్వజ్ఞానమును తెలుసుకొని ఉపదేశించేవారు గురువు. తెలుసుకొని అనగా ఎవరి నుండి తెలుసుకున్నారు అనే సందేహం కలుగుతుంది. దక్షిణామూర్తయే జ్ఞానస్వరూపులు అని అర్థం.

**(గత నెల సంచిక తరువాయి)**

## బృహదారణ్యక ఉపనిషద్ భాష్యం మరియు టీకా (1.4.7)

## నేను సంసారి కాదు అసంసారి

### భాష్యము: భగదవత్పాదులు శ్రీ ఆది శంకరాచార్యులు

**టీకా: ఆనంద్ గిరి జి, బ్ర. పూర్ణచైతన్య**

**శరీరేన్ద్రియసంఘాత ఆత్మత్వేన గతాం ధియమ్ ॥**
**నిత్యాత్మజ్యోతిషా దీప్తాం విశింషన్తి సుఖాదయః ॥563॥**

శరీర ఇంద్రియ మనోబుద్ధుల సంఘాతమును ఆత్మగా భావిస్తున్నాను. నిత్య ఆత్మ ఈ శరీర ఇంద్రియ మనోబుద్ధుల సంఘాతమును ప్రకాశిస్తుంది. ఈ సంఘాతమునకు వేరుగా ఉంది.

ఆత్మ ప్రత్యక్ష ప్రమాణాది విషయము కాదు అనడానికి శృతులు –

న దృష్టేః ద్రష్టారం పశ్యేః" (బృ.ఉ:3.4.2)– బుద్ధి ఆత్మను తెలుసుకోలేదు.

"విజ్ఞాతారమరే కేన విజానీయాత్" (బృ.ఉ: 3.8.11) – తెలిసేదే కానీ తెలియబడేది కాదు. మొదలైన శృతుల ద్వారా ఆత్మ ప్రత్యక్షాది ప్రమాణ విషయం కాదని స్పష్టమవుతుంది. ప్రత్యక్షాది ప్రమాణ విషయం బుద్ధి ఇంద్రియ విషయాలు, కావున సుఖ దుఃఖాలు బుద్ధికి చెందినవి ఆత్మకు కావు. నేను ఆత్మని, బుద్ధిని కాదు అందువలన నేను అసంసారి, సంసారిని కాదు.

లోకములో గల వస్తువులన్నింటి కంటె కాలము మిక్కిలి అమూల్యమైనది. క్షణములను వ్యర్థము చేయువారు జీవితమునే వ్యర్థము చేయుదురు. కాలమును వృధాచేయక, ప్రతి అడుగునను, ప్రతిక్షణమున దైవమును స్మరించుచు తరించుడు. నేడే మనది. రేపు మనది కాదు. **–ఓంకార సూక్తులు**



# కథ

శిఖిధ్వజుడను నొకరాజు తపమాచరించుటకై యడవికి బోయెను. బ్రహ్మజ్ఞాని యగు నతనిభార్య రాజునకు నిజమైన మార్గమును బోధింప దలచి మునివేషమును దాల్చి రాజు చెంతకు బోయెను. అచట నొక ఘోరారణ్యమునందు జిన్న పూరిగుడిశె నిర్మించుకొని యందు పద్మా సనాసీనుండై ధ్యాననిష్ఠయందున్న యా రాజునెదుట నామె నిలిచెను. రాజు మునివేషముతోనున్న తన భార్యను గుర్తించక తన్ను కృతార్థుని జేయుటకై దర్శనమిచ్చిన ఋష్యుత్తముండని తలచి యామె పాదములకు నమస్కరించి "దేవా! నాకు మోక్షప్రాప్తియగుటకు తగునుపదేశముచేసి నన్నను గ్రహింపు"డని వేడెను. అంత నామె "ఓ రాజా, నీవు సర్వసంగపరిత్యాగము చేసిన గాని మోక్షము లభించ"దనెను. అంత రాజు "ఆహా, ఏమి నేను సకల భోగములను వీడి, కౌపీన ధారినై, యరణ్యమున నేకాంతముగాఁదపమాచరించు చుండియు; నేను సర్వసంగ పరిత్యాగిని కానట! (అని యాలోచించి) ఓహెూ తెలిసినది ఈ యరణ్య మందు సహితమొక కుటీరము నేర్పరచుకొంటిని, దీనిని నిర్మూలము గావించెద"నని వెంటనే ఆ యింటిని మంటఁగలిపి యామెకు నమస్కరించి "దేవా, ఇప్పుడను గ్రహించు"డని వేడెను. అప్పుడును నామె "రాజా, నీవు సర్వసంగ పరిత్యాగివైనఁగాని ముక్తి లభించ"దనెను. రాజు విస్మయము జెంది యటునిటు చూచి, ప్రక్కనున్న తన దండ మండలములనుగాంచి, వాని నగ్నిలోఁ బాఱవైచి, చేతులు జోడించి తిఱిగి యామెను వేడెను. అంత నామె మునుపటివలెనే సర్వసంగ పరిత్యాగియే మోక్షమున కర్హుడనెను, అంత రాజు తనకింకను నొక గోచియుండుటఁ జూచి దానిని నూడఁబెఱికి యగ్నిలోఁ బడవేసి "మహానుభావా, ఇప్పుడు నిజముగ నేను సర్వసంగ పరిత్యాగిని. ఇక సంశయము లేదు. ఇకనైన ననుగ్రహింపుడు" అని బల్కినంతనే యామె యా రాజు భుజముపై జేయివైచి "ఈదేహమెవ్వరిది?" యని యడిగెను. వెంటనే రాజు "నాదే" యనెను. అంత నామె "రాజా! సర్వసంగ పరిత్యాగియే మోక్షమున కర్హుఁ"డని తిరిగి చెప్పెను. రాజు కొంచమాలోచించి ఆహా! నేను సమస్తమును విడిచినను ఇంకను నా దేహము మిగిలియున్నదే! ఛీ, దీనింగాల్పవలెనని యా మంటలోకి దుముకఁబోవుచుండెను. వెంటనే యామె, యాతని చేయిబట్టుకొని "రాజా, నిలువుము! నిలువుము! ఏమి చేయుచున్నావు?" అని యడుగ నా రాజు "నాదేహమునుగూడ పరిత్యజించు చున్నా"నని చెప్పెను. అంతనామో "రాజా! నీ దేహము కాలినపిమ్మట నేమి యగు"నని యడుగ "బూడిదయగు"ననెను. అంతనామె "ఆ బూడిద యెవరిది" యని తిరిగి యడిగెను. రాజు "అదియు నాదే" యనెను. ఆమె "రాజా, సర్వసంగ పరిత్యాగికే మోక్షము లభించును. సుమా!" యనెను. అంత రాజు "ఓహో, ఇదేమి యాశ్చర్యము! నేను జచ్చినను నా బూడిద మిగులు

చున్నదే! నేను సర్వసంగ పరిత్యాగ మికనెట్లు చేయవలెను?" అని యేమియు దోచక యామె పాదములపైబడి "దేవా, సర్వసంగపరిత్యాగము చేయు తెఱంగె ఱింగించు"దని వేడెను. అంతనామె "రాజా, ఈ రాజ్యము నాది. ఈ భార్యా పుత్రాదులు నావారలు, ఈ సకలభోగములు నావి, దేహము నాది, ఈ మనస్సు నాది యీ మొదలగువాటియందన్నిటియందును నాది నాది యను మమకారము గలిగియున్నావు. అదియే బంధమునకు గారణము, బాహ్య విషయములను విసర్జించిన మాత్రముననే సర్వసంగపరిత్యాగి కానేరదు. ఈ మమత్వబుద్ధి వీడి వెంటనే యాతని నిజస్వరూపంబగు పరిపూర్ణసచ్చిదానంద బ్రహ్మమునుబొంది నిరవధిక తేజోవిరాజత వదనారవిందుడై ప్రకాశించెను.

14. మనస్ఫూర్తిగా గురువుయందు ప్రేమ, మనస్ఫూర్తిగా గురుదర్శనంకోసం తపన వున్నట్లు అయితే యెన్నో వందల సంవత్సరాలు జపధ్యానాదుల వల్ల కూడా కలగనంత గొప్పగా, పవిత్రంగా మారుతుంది ఈ మనస్సు. సత్‌గురువు యొక్క దర్శనంకోసం నిజమైన కోరిక కలిగినంత మాత్రం చేతనే మనస్సు మహాపవిత్రం అవుతుంది.

15. ఈ యుగంలో ముక్తి, భగవంతుడిలో ఐక్యం చెందడం, త్వరగా మనస్సు నిర్మలత చెందడం మొదలైన వాటికి అన్నిటికి ఉపాయం సత్‌గురువుయందు నిజమైన ప్రేమ, ఆయనయందు నమ్మకం. ఆయనని మానవుడుగా తలచకపోవడం. ఇవే ప్రధానమైన ఉపాయాలు.

**-అమృత వచనములు బాబా జయమల్ సింగ్**

| | |
|---|---|
| **1. మాతృ ఆశ్రమం**<br>శ్రీ శాంతి ఆశ్రమము<br>తోటపల్లి కొండలు,పిన్ : 533 446<br>వయా శంఖవరం, కాకినాడ జిల్లా<br>సెల్ :7382009962<br>రిసెప్షన్ : 7815890094<br>e-mail : srisanthiashram@gmail.com | **4. కోటగిరి శాఖ**<br>పీస్ సెంటర్, డార్‌మోనా రోడ్,<br>కోటగిరి-643217, నీలగిరిజిల్లా,<br>తమిళనాడు,<br>ఫోన్ : 04266- 271945<br>e-mail: vsvmsktg@yahoo.com<br>vsvmsktg@gmail.com |
| **2. విశాఖ : శాంతి ఆశ్రమము**<br>లాసన్స్‌బే, పెదవాల్తేరు-530 017<br>విశాఖపట్నం<br>ఫోన్ : 0891 - 2538689<br>e-mail : srisanthiashramvsp@gmail.com | **5. కాకినాడ శాఖ**<br>శాంతి ఆశ్రమము,అశోక్ నగర్<br>కాకినాడ - 533 004<br>కాకినాడ జిల్లా |
| **3. విశ్వశాంతి క్షేత్రం**<br>కైలాసగిరి<br>విశాఖపట్నం | **6. పిఠాపురం శాఖ**<br>స్టువర్టు పేట,పిఠాపురం-533 450<br>కాకినాడ జిల్లా |

Website : www.srisantiashram.org



## విరాళములు

| | | |
|---|---|---|
| 1. | డా॥కొమరగిరి వెంకట రామారావు గారు, రాజమండ్రి | 10,000/- |
| 2. | శ్రీ ఆర్.టి.వి. రామకృష్ణారావు గారు, కాకినాడ | 5,000/- |
| 3. | శ్రీ కముజు శ్రీనివాస్ గారు (హైదరాబాద్) గోగ్రాసం నిమిత్తం | 5,000/- |
| 4. | శ్రీ కముజు కరుణాకర్ గారు (హైదరాబాద్)గోగ్రాసం నిమిత్తం | 5,000/- |
| 5. | శ్రీ కొత్తపల్లి నారాయణ ప్రసాద్ గారు (హైదరాబాద్) వీరి తండ్రి శ్రీ కె.రామచంద్రరావు గారి జ్ఞాపకార్థం అన్నదానం | 6,000/- |
| 6. | శ్రీ దారా విజయ్‌కుమార్ గారు (కలకత్తా) | 5,000/- |
| 7. | శ్రీమతి మెర్ల వీర రాఘవమ్మగారు (వేళంగి) గోదానం మరియు అన్నదానం నిమిత్తం | 40,000/- |
| 8. | శ్రీ కె. కృష్ణమూర్తి గారు (విశాఖపట్నం) | 5,000/- |
| 9. | శ్రీమతి రావుస్వాతి గారు (కత్తిపూడి) | 3,000/- |
| 10. | శ్రీమతి వసుమతి నాయుడు గారు (శాంతి ఆశ్రమం) కార్తీక వనభోజనాలు నిమిత్తం | 3,000/- |
| 11. | శ్రీ నూకల బాబూరావు గారు (శాంతి ఆశ్రమం) కార్తీక వనభోజనాలు నిమిత్తం | 5,000/- |

## శాశ్వత అన్నదానం

| | | |
|---|---|---|
| 1. | శ్రీమతి మంజువాణి మరియు కృష్ణంరాజు గారు (హైదరాబాదు), శ్రీమతి ఆర్.ఎస్.కుమారి గారు జ్ఞాపకార్థం, శ్రీమతి కె.చిన పార్వతి గారి జ్ఞాపకార్థం శ్రీ ఆర్.ఎస్.రాజుగారి జ్ఞాపకార్థం | 30,000/- |
| 2. | కుమారి వేములపూడి వెంకట నాగదుర్గ పూర్ణ శ్యామా, కుమారి రామ వెంకట కాళీ శ్రీమా గార్లు (కాకినాడ) వీరి పెద్ద నాన్నగారు శ్రీ వేములపూడి శ్రీనివాస బాలాజీ గారి పుట్టినరోజు సందర్భముగా | 10,000/- |
| 3. | శ్రీమతి మెర్ల వీర రాఘవమ్మగారు (వేళంగి) వీరి తల్లిదండ్రులు శ్రీ కోరా లక్ష్మీనారాయణ గారు శ్రీమతి కోరా సుబ్బయమ్మగార్ల జ్ఞాపకార్థం | 50,000/- |
| 4. | శ్రీమతి & శ్రీ నూనె వీర వెంకట సూర్యనారాయణ ఆదిలక్ష్మి గార్లు (పెదపూడి) వీరి మామ, అత్తగార్లు కోరా లక్ష్మీనారాయణ, శ్రీమతి కోరా సుబ్బయమ్మ గార్ల జ్ఞాపకార్థం | 50,000/- |

5. శ్రీమతి మెర్ల విజయభారతి గారు (వేళంగి)
వీరి తాత నాయనమ్మ వేగుళ్ళ జానకిరామయ్య,
ప్రభావతి గార్ల జ్ఞాపకార్థం 50,000/-
6. శ్రీ బైపల్లి దుర్యోధనరావు గారు (విశాఖపట్నం)
వీరి కుమార్తె శ్రీమతి మైలపల్లి శ్రీదేవిగారి
పుట్టినరోజు సందర్భముగా 10,000/-

## కార్యక్రమములు - మాతృఆశ్రమం

**డి.01-12-2025 సోమవారము :** గీతాజయంతి పురస్కరించుకొని దిగువ ప్రార్థనా మందిరంలో ఉదయం గీతాపారాయణ జరుగును.

**డి.04-12-2025 గురువారము :** దత్తజయంతి సందర్భంగా దిగువ ప్రార్థన మందిరములో దత్తపూజ నిర్వహించబడును.

**డి.25-12-2025 మంగళవారము :** ఓంకార మందిరములో రాత్రి క్రిస్టమస్ సందర్భంగా ప్రార్థనలు జరుపబడును.

**డి.30-12-2025 ఆదివారము :** వైకుంఠ ఏకాదశి సందర్భంగా పూజలు జరుపబడును.

## దైవసాయుజ్యం

**1. డి.30-12-2025** చొప్పా వెంకటేశ్వరరావు గారు 15 సం॥లుగా ఆశ్రమ జీవనం చేస్తూ, ఆశ్రమానికి ఎంతో అపారమైన సేవను అందిస్తూ, ఆధ్యాత్మిక ప్రవచనాలను ఎంతో ఆసక్తిగా ఆలకించిన ధన్యజీవి. స్వగృహమునందు దైవసాయుజ్యమును పొందినారు.

**2. డి.03-11-2025** పోతుకూచి భాస్కరరావుగారు, బెంగళూరు వాస్తవ్యులు అన్నదానమునకు, విద్యాదానమునకు, గ్రంథ ప్రచురణకు విశేషముగా సేవలందించారు. 3వ తేదీన వారి స్వగృహమునందు దైవసాయుజ్యము పొందినారు.

**3. డి.11-11-2025** హైదరాబాదు వాస్తవ్యులు కామినీ గుప్తగారు, వీరు ఆశ్రమానికి అన్నివిధాలుగా సేవలను అందించేవారు. స్వగృహమునందు దైవసాయుజ్యమును పొందినారు.

వీరందరి కుటుంబాలకు ఆశ్రమవాసులు, అధిష్ఠానం ప్రగాఢ సానుభూతిని అందిస్తున్నారు. వారి ఆత్మశాంతికి ఆశ్రమంలో శాంతి ప్రార్థన చేయబడింది. స్వామి ఓంకార్ వారి కుటుంబ సభ్యులకు ఉపశమనం కలిగిస్తారని ఆశిస్తున్నాము.



## దాతలకు విజ్ఞప్తి

దివ్యాత్మ స్వరూపులకు సూచన. శ్రీ శాంతి ఆశ్రమమునకు విరాళము ధన రూపంలో / చెక్కు / ఎస్.బి.ఐ. కత్తిపూడి, అకౌంట్ నెం. 11003309435 కు IFSC Code : SBIN0014774 ఆన్‌లైన్ ద్వారా పంపగలరు. మీ విరాళములకు ఇన్‌కమ్‌ట్యాక్స్ 80జి రాయితీ కలదు. మీరు ఏ విధంగా విరాళము పంపినను వ్రాత పూర్వకంగా లేదా ఇమెయిల్ ద్వారా మొబైల్ నంబరు 7382009962 మరియు రిసెప్షన్ నెంబరు 7815890094కు మీ పేరు, చిరునామా మీ మొబైల్ నంబరు తెలుపగలరు.

## శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి

శాంతి పత్రిక ప్రతినెలా 5వ తేదీన పోస్టు చేయబడును.

సం॥ర చందా రూ. 100/-, జీవిత చందా రూ. 1000/- (12 సంవత్సరముల వరకు మాత్రమే), ఎమ్.ఓ/స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కత్తిపూడి అకౌంట్ నెం. 11003309435, ఆన్‌లైన్ ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

ఎమ్.ఓ.ఫారమ్‌లో దిగువ ఫర్ కమ్యూనికేషన్ భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.

చందాకాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొనవలెను. మీ అడ్రస్ మార్పు జరిగితే, ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి. చందా వివరములు తెలుపని యెడల సొమ్ము విరాళముగా జమచేయబడును.

కార్యదర్శి, శ్రీ శాంతి ఆశ్రమం (పోస్ట్)
వయా శంఖవరం - 533 446, తూ.గో.జిల్లా

## విన్నపము

విదేశములలో వుండు ఆశ్రమ భక్తులు విరాళములు ఈ క్రింది ఎఫ్.సి.ఆర్.ఎ (Foreign Contributions Regulation Act) బ్యాంక్ అకౌంట్‌కు తమ నివాస ప్రాంతములోని తమ బ్యాంక్ అకౌంట్ నుండి ఆ దేశ కరెన్సీలో పంపగలరు. పంపిన పిదప వివరములు srisanthiashram@gmail.com అనే మెయిల్ ఐడికి మరియు mattavvs07@gmail.com తప్పకుండా పంపవలెను.

బ్యాంకు పేరు : State Bank of India, 11 Sansad Marg, New Delhi -110001
A/c Name : The Mission of peace - FCRA A/c No : 40127798428
Swift Code : SBININBB104

# శ్రీ శాంతి ఆశ్రమ ప్రచురణలు

| | |
|---|---|
| 1. శాంతి ప్రదాత శ్రీ స్వామి ఓంకార్ ఆత్మకథ | 100/- |
| 2. ఓంకార సద్భోధామృతము | 70/- |
| 3. సోహం | 10/- |
| 4. ఓం జపం | 10/- |
| 5. మౌనపు ఘడియలు | 30/- |
| 6. ప్రేమయే దైవము | 10/- |
| 7. భగత్సాక్షాత్కారము ఇప్పుడు ఇక్కడే | 10/- |
| 8. శాంతి దళములు | 10/- |
| 9. ఆధ్యాత్మిక మెరుపులు | 10/- |
| 10. సత్సంగ సందేశములు | 30/- |
| 11. ఓంకార సూక్తులు | 10/- |
| 12. ఓంకార స్తోత్ర కదంబం | 10/- |
| 13. శాంతి సూక్తులు | 10/- |
| 14. శాంతి ప్రార్థన | 20/- |
| 15. శ్రీ శాంతి స్తోత్రమాల | 30/- |
| 16. స్వామి ఓంకార్ ఆత్మదర్శిని | 20/- |
| 17. సందేశ తరంగిణి | 40/- |
| 18. నా చెల్లి పునర్జన్మ | 10/- |
| 19. నేను ఆంగ్లభాష ఎలా నేర్చుకొన్నాను. | 20/- |
| 20. శ్రీశ్రీశ్రీ ఓంకార స్వామి స్తోత్రము | 20/- |
| 21. శాంతి దూత స్వామి ఓంకార్ | 30/- |
| 22. స్వామి ఓంకార్ జీవిత విశేషాలు | 10/- |
| 23. శ్రీ శాంతి ఆశ్రమ చరిత్ర (1917-2020) | 100/- |
| 24. ధ్యానము | 30/- |
| 25. పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ వారి దివ్య సందేశములు దేశ విదేశీయ పర్యటనలు | 50/- |
| 26. ప్రార్థనలు - ధ్యానములు | 20/- |
| 27. విశ్వ ప్రార్థన | 20/- |
| 28. శ్రీ శాంతి ఆశ్రమం శతాబ్ధి సంచిక | 120/- |
| 29. నిత్య సందేశములు | 20/- |
| 30. ఆంతర్య భావనలు | 20/- |
| 31. శ్రీ ఓంకార బోధామృతం | 20/- |
| 32. నాల్గు దశలలో ఉపదేశము | 10/- |
| 33. శాంతి ప్రార్థన - స్వామి ఓంకార్ | 20/- |

This Periodical is Registered with Registar of Newspapers, New Delhi Vide R.No. 3447/57,
Dt. 18-12-20 Permitted to Post Under Concessional Postage Vide AP/KD-24/2024-2026

# SRI SANTI ASHRAM ENGLISH PUBLICATIONS

| | | |
|---|---|---|
| 1. Auto Biography of swami Omkar (2 Volumes) | Rs. | 150/- |
| 2. Life and Teachings of Swami Omkar | Rs. | 10/- |
| 3. Soham | Rs. | 10/- |
| 4. Cosmic Fast | Rs. | 20/- |
| 5. Meditation | Rs. | 10/- |
| 6. Om Japa | Rs. | 10/- |
| 7. Control of Mind | Rs. | 30/- |
| 8. Cosmic Flashes | Rs. | 10/- |
| 9. In the Hours of Silence | Rs. | 10/- |
| 10. The Soul of Omkar | Rs. | 10/- |
| 11. How I learned English | Rs. | 10/- |
| 12. Reincarnation of my Little Sister | Rs. | 10/- |
| 13. God Realization Now and Here | Rs. | 10/- |
| 14. Mystic Prayers and Poems | Rs. | 20/- |
| 15. The Divine Voice of Omkar | Rs. | 40/- |
| 16. Auto Biography of Omkar (Revised Edition) | Rs. | 100/- |
| 17. Petals of Peace | Rs. | 20/- |
| 18. The Story of my life and Work | Rs. | 10/- |
| 19. Priceless legacy of Swami Omkar | Rs. | 10/- |
| 20. The Four Initiations | Rs. | 10/- |
| 21. Musings | Rs. | 20/- |
| 22. Peace Prayer | Rs. | 20/- |

**THE MISSION OF PEACE**

**శ్రీ శాంతి ఆశ్రమము**

పోస్టు: శాంతి ఆశ్రమము
(వయా) శంఖవరం - 533 446
కాకినాడ జిల్లా, (ఆం.ప్ర.)
ఫోన్ : 7382009962
email: srisanthiashram@gmail.com
www: www.srisantiashram.org

Book Post

______________________

______________________

______________________

Published by MVV Satyanarayana on behalf of The Mission of Peace - Sri Santi Ashram and printed at Mohan Graphics, Kakinada - 533 001. Ph:0884-2361419 and Published at Thotapalli Hills-533 446, Ph: 73820 09962 Editor : Swamini Vinamrananda